S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక



epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565



సంపుటి: 19 | సంచిక: 303 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |




# 2030 నాటికి జీరో పావర్టీ

## 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ

- రాష్ట్ర అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచాలని నిర్ణయం
- పేదరికం లేని తెలంగాణే లక్ష్యం
- టీఎస్‌డీపీఎస్ బలోపేతం.. ప్రత్యేక ప్రాజెక్టు నిర్వహణ విభాగం ఏర్పాటు
- జిల్లాల వారీ అభివృద్ధి ప్రణాళికలు.. ఏడు రంగాల వృద్ధి కేంద్రాలకు రూపకల్పన
- ప్రభుత్వం-జీఎఫ్‌ఎస్‌టీ భాగస్వామ్యానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని నిర్ణయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమవుతోంది. దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక-ప్రణాళిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, జీఎఫ్‌ఎస్‌టీ ఉపాధ్యక్షుడు ఎస్‌పీ టక్కర్‌తోపాటు ఆ సంస్థ ప్రతినిధులు, ఆర్థిక-ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక, అమలు వ్యవస్థలను బలోపేతం చేయడం, శాఖల మధ్య

మిగతా 2 లో

## అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి

తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలి

చారిత్రక కట్టడాల పరిరక్షణ, ఆదాయ వనరుల పెంపునకు ప్రణాళికలు

అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం 2

## సీఎం రేవంత్‌కు 'ఉత్తమ ప్రజా సేవకుడు' పురస్కారం

'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డుకు ఎంపిక 2



## ఆస్పత్రుల్లో భద్రతకు ఫైర్ వాల్

### ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో క్రమం తప్పకుండా ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి



- ఏడాదికోసారి భవన నిర్మాణ భద్రతపై సమగ్ర తనిఖీ
- లోపాలను గుర్తించడమే కాదు.. గడువులోగా సరిచేయాలి 2
- ఆసుపత్రుల్లో భద్రతపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

## దానం తీర్పుపై విపక్షాల 'సుప్రీం' అస్త్రం

- సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాన్ని స్వాగతించిన బీజేపీ, బీఆర్ఎస్
- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ నైతికతకు విజయమన్న రామచందర్‌రావు
- మిగతా ఫిరాయింపు ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించాలని డిమాండ్ 3
- 'సంవిధాన్ బచావో' మాటలను ఆచరణలో చూపాలన్న హరీశ్‌రావు
- కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తున్న తీర్పంటూ విమర్శ





## బైక్ ఢీకొని ఎస్సై మృతి

గణేష్ నిమజ్జనోత్సవాల వేళ తీవ్ర విషాదం

చికిత్స పొందుతూ కొత్తగూడెం టూ-టౌన్ ఎస్సై మృతి 3

ఎస్ఐ కుటుంబానికి అండగా ఉంటామని సీఎం హామీ

## 'చేయూత' దరఖాస్తుల పరిశీలనకు గడువు పొడిగింపు 3

## 22ఏ భూముల రిజిస్ట్రేషన్లకు గ్రీన్‌సిగ్నల్




- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులున్న ప్లాట్లకు అవకాశం
- 22ఏ జాబితాలో ఉన్నా ఆమోదిత లేఅవుట్లకు రిజిస్ట్రేషన్లు
- తక్షణమే అమల్లోకి ప్రభుత్వ ఆదేశాలు
- ప్లాట్ల యజమానులు, గృహ కొనుగోలుదారులకు ఊరట 2

## రోడ్డు ప్రమాదాల నివారణకు కీలక నిర్ణయం

'టీజీ-టీమార్స్' ఏర్పాటు 2

జీవో 135 విడుదల చేసిన సీఎస్



## దానం పార్టీ ఫిరాయింపు తప్పే

- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు
- మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సిందే
- పదవితో పాటు పార్టీ మారడం తీవ్రమైన రాజ్యాంగ ఉల్లంఘనే 2




### ఉప ఎన్నికకు సిద్ధం

దానం నాగేందర్ 3

## 'ఓటు చోరీ'తో గెలిస్తే.. ఆ చట్టాలూ చెల్లవు!

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి 4
- సీఈసీ అపూర్వర్‌గా మారడం దేశ ప్రయోజనాలకు మంచిది
- ఢిల్లీ మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



## 48 గంటల్లో సీఈసీ రాజీనామా చేయాలి

- జ్ఞానేశ్ కుమార్‌కు కాక్రోచ్ జనతా పార్టీ అల్టిమేటం 4
- లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరిక
- రాజీనామా చేసే వరకు తగ్గేది లేదన్న అభిజీత్






## దానం పార్టీ ఫిరాయింపు తప్పే

### హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

### మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సిందే

**ఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** దానం నాగేందర్‌పై రాష్ట్ర హైకోర్టు అనర్హత వేటు వేయడాన్ని సుప్రీం కోర్టు సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరగగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారించింది. దానం పిటిషన్‌పై విచారణకు న్యాయస్థానం నిరాకరించింది. ఆయనపై అనర్హత వేటు పడిందని.. మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని అభిప్రాయపడింది. వ్యక్తిగతంగా పార్టీలో చేరితే తప్పు కాదని.. పదవితోపాటు ఫిరాయింపు తప్పేనని ధర్మాసనం తేల్చి చెప్పింది. హైకోర్టు ఉత్తర్వుల్లో ఎలాంటి జోక్యం చేసుకోమని నిరాకరిస్తూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఎమ్మెల్యేగా రాజీనామా చేయకపోయినా లేదా అధికారికంగా రాజీనామా పత్రం ఇవ్వకపోయినా వేరే రాజకీయ పార్టీ టికెట్‌పై నామినేషన్ వేసి పోటీ చేయడం రాజ్యాంగబద్ధంగా పార్టీని వీడినట్లేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని, సుస్పష్టమైన ఆధారాలు (మరో పార్టీ బీ–ఫాంపై పోటీ చేయడం) ఉన్నప్పుడు స్పీకర్ చర్య తీసుకోకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తుందని సుప్రీం కోర్టు తెలిపింది. దానం తరఫున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. దానం తిరిగి సొంత పార్టీకి వచ్చి(ఘర్ వాపసీ) పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఆయనపై పార్టీ నుంచి ఎలాంటి ఫిర్యాదు లేదని అన్నారు. ఆయనపై అనర్హత వేటు పడకూడదని అన్నారు. పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడం వేరు.. చట్టసభ సభ్యత్వాన్ని నిలబెట్టుకోవడం వేరు అని ధర్మాసనం అభిప్రాయపడింది. పార్టీలోకి తిరిగి వచ్చినంత మాత్రాన చట్టసభ సభ్యత్వంపై పడే అనర్హత వేటు తొలగిపోదని సుప్రీంకోర్టు పేర్కొంది.

## రేవంత్‌కు ‘ఉత్తమ ప్రజా సేవకుడు’ పురస్కారం

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మక ‘ఆర్యదాన్ ముహమ్మద్–2026 ఉత్తమ ప్రజా సేవకుడు’ పురస్కారానికి ఎంపికయ్యారు. కేరళకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందిస్తోంది. శుక్రవారం కేరళలోని నిలంబూర్‌లో జరిగే కార్యక్రమంలో రేవంత్‌రెడ్డికి అవార్డును ప్రదానం చేయనున్నారు. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర వర్గాల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు, నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని రేవంత్‌రెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ వెల్లడించారు. ప్రజాస్వామిక విలువల పట్ల రేవంత్‌రెడ్డి నిబద్ధతను కూడా ఎంపిక కమిటీ ప్రశంసించినట్లు ఫౌండేషన్ తెలిపింది. ఇవి అవార్డు ఎంపికకు సంబంధించి ఫౌండేషన్ పేర్కొన్న కారణాలు. పురస్కార గ్రహీత ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్, రచయిత, మేధావి కల్పేట్ట నారాయణన్ ఎంపిక కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. పురస్కారం కింద రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేయనున్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 25న నిలంబూర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డికి పురస్కారం అందజేయనున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకోపన్యాసం చేయనున్నారు. కేరళ రాజకీయాల్లో సుదీర్ఘకాలం కొనసాగిన ఆర్యదాన్ ముహమ్మద్ నిలంబూర్ నుంచి ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వివిధ ప్రభుత్వాల్లో నాలుగుసార్లు మంత్రిగా పనిచేశారు. ఆయన స్మారకార్థం ఏర్పాటు చేసిన పురస్కారంలో ఈ ఏడాది ఉత్తమ ప్రజా సేవకుడిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఫౌండేషన్ ఎంపిక చేసింది.

# 2030 నాటికి జీరో పావర్టీ

మొదటి పేజీ తరువాయి

సమన్వయం పెంచడం, అభివృద్ధి ఫలితాలను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను రూపొందించడంపై చర్చించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రాజెక్టు నిర్వహణ విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రాధాన్యతా అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, పురోగతిని వేగవంతం చేయడం ఈ విభాగం ప్రధాన బాధ్యతలుగా ఉండనున్నాయి. 2030 నాటికి తెలంగాణను పేదరిక రహిత రాష్ట్రంగా మార్చేందుకు లక్షిత కార్యక్రమాలను అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పేదరికానికి గురయ్యే కుటుంబాలను గుర్తించి, వారికి వివిధ ప్రభుత్వ పథకాలను సమన్వయంతో అందించడంతోపాటు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించనున్నారు. కార్యక్రమాల ఫలితాలను ఎప్పటికప్పుడు కొలిచి, పర్యవేక్షించే ప్రత్యేక వ్యవస్థను కూడా తీసుకురావాలని ప్రతిపాదించారు. 2033 నాటికి దేశంలో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది. రాష్ట్రానికి ఉన్న ఆర్థిక, పారిశ్రామిక బలాలను మరింత సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, సమ్మిళిత అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చేలా వ్యూహం రూపొందించనుంది. ఇది ప్రభుత్వ లక్ష్యమని, సాధించిన ఫలితంగా కాకుండా ప్రతిపాదిత అభివృద్ధి కార్యాచరణగా చూడాలి రాష్ట్రస్థాయి లక్ష్యాలను జిల్లాల స్థాయిలో కొలిచే ఫలితాలుగా మార్చేందుకు సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించనున్నారు. వీటికి డేటా ఆధారిత డ్యాష్‌బోర్డులు, స్పష్టమైన పనితీరు సూచికలు, కొలిచే ఫలితాలు, బడ్జెట్ అనుసంధానం ఉండేలా చూడాలని భట్టి సూచించారు. దీనివల్ల జిల్లాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి, వెనుకబడిన అంశాలను గుర్తించి సకాలంలో దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ శాఖలు, రంగాల నిపుణులు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, అభివృద్ధి సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు ఏడు రంగాల వృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పేదరిక నిర్మూలన, మౌలిక వసతులు–రవాణా వ్యవస్థ, ఆరోగ్యం, పర్యాటకం, పశుసంపద–ఆక్వాకల్చర్, పట్టణీకరణ, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ అంశాలపై ఇవి ప్రధానంగా దృష్టి సారించనున్నాయి. అభివృద్ధి అవకాశాలను గుర్తించడం, అమలులో ఎదురయ్యే అవరోధాలకు పరిష్కారాలు సూచించడం, కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించడం వీటి



లక్ష్యంగా పేర్కొన్నారు. వ్యూహాత్మక ప్రణాళిక, డేటా ఆధారిత నిర్ణయాలు, సాంకేతిక పరిజ్ఞానం, విజ్ఞాన సహకారం, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ తదితర అంశాల్లో సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం–జీఎఫ్ఎస్‌టీ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకునే ప్రతిపాదనను సిద్ధం చేయాలని నిర్ణయించారు. వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన నిపుణులు, కన్సల్టెంట్ల సేవలను కూడా వినియోగించుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రణాళికల రూపకల్పనతోనే సరిపెట్టకుండా వాటి అమలు, ఫలితాల పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థను నిర్మించి 2030 పేదరిక నిర్మూలన, 2033 అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ లక్ష్యాల దిశగా ముందుకు వెళ్లాలన్నది ప్రభుత్వ కార్యాచరణగా సమావేశంలో పేర్కొన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలి



- తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలి
- చారిత్రక కట్టడాల పరిరక్షణ, ఆదాయ వనరుల పెంపునకు ప్రణాళికలు
- పర్యాటక రంగంలో పెట్టుబడులు పెంచాలి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిశానిర్దేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత విస్తరించి, తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రజా భవన్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖల ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో పర్యాటక ప్రాజెక్టులు, శాఖ పరిధిలోని ఆస్తుల సమర్థ వినియోగం, పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పెట్టుబడులు, చారిత్రక కట్టడాల పరిరక్షణ మరియు బ్రాండింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పర్యాటక అభివృద్ధి అంటే కేవలం ప్రాంతాల అభివృద్ధి మాత్రమే కాదని, తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం కూడా అందులో భాగమేనని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా పర్యాటక శాఖ ఆస్తులైన భవనాలు, ఖాళీ స్థలాలను గుర్తించి పీపీపీ విధానంలో కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్రంలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హిల్ టూరిజం విభాగాలను ప్రోత్సహిస్తూ, హైదరాబాద్‌కు వచ్చే విదేశీ, దేశీయ పర్యాటకులను ఇతర జిల్లాలకు ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లను రూపొందించాలని ఆదేశించారు. రామప్ప వంటి ప్రపంచ వారసత్వ సంపద పరిరక్షణకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని, మౌలిక వసతులు, హోటళ్లు, రిసార్టుల ఏర్పాటులో ప్రైవేట్ భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల్లో రాష్ట్ర చరిత్ర, సంస్కృతిపై అవగాహన పెంచేందుకు ‘తెలంగాణ దర్శిని’ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, వారిని మ్యూజియంలు, చారిత్రక ప్రాంతాలకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రైవేట్ పెట్టుబడులకు ప్రతిబంధకంగా మారిన లీజు విధానాలు, ఆర్థిక సాధ్యాసాధ్యాల సమస్యలను తక్షణమే పరిష్కరించి నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ స్నిగ్ధా పట్నాయక్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ం విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా యాదాద్రి కేంద్రంలో ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లాలని స్పష్టం చేసింది. ఇందుకు అవసరమైన బొగ్గు సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి సారించాలని సూచించింది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యంతో పనిచేయకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీ--9 గ్రేడ్ బొగ్గు లభ్యత, ప్రస్తుతం జరుగుతున్న బొగ్గు సరఫరా, దానివల్ల రాష్ట్రంపై పడుతున్న అదనపు ఆర్థిక భారం, సింగరేణికి సంబంధించిన బొగ్గు బ్లాకుల పరిస్థితిపై ప్రధానంగా చర్చించారు. యాదాద్రి విద్యుత్ కేంద్రానికి అవసరమైన నాణ్యమైన బొగ్గును నిరంతరాయంగా సమకూర్చడంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. బొగ్గు లభ్యతలో ఎదురవుతున్న సమస్యలు, రవాణా వ్యయం, సరఫరా కారణంగా రాష్ట్రంపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని అధికారులు వివరించారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహానది కోల్‌ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి అవసరమైన బొగ్గు కొనుగోలుకు వెంటనే చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అనుమతులు, కేటాయింపులు, సరఫరా అంశాలపై కేంద్ర బొగ్గు గనుల శాఖతో తక్షణమే సంప్రదింపులు జరపాలని సూచించారు. సింగరేణి నుంచి అందుబాటులో ఉన్న బొగ్గు, ఇతర సంస్థల నుంచి సమకూర్చుకునే అవకాశాలను సమగ్రంగా పరిశీలించి యాదాద్రి విద్యుత్ కేంద్రానికి నిరంతరాయంగా బొగ్గు అందేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా దసరాలోపు అన్ని చర్యలు పూర్తి చేయాలని అధికారులకు గడువు విధించారు. బొగ్గు సరఫరా నుంచి విద్యుత్ ఉత్పత్తి వరకు ఎదురవుతున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి అన్ని యూనిట్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అవసరమైన బొగ్గు నిల్వలు ఉండేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఆస్పత్రుల్లో భద్రతకు ‘ఫైర్ వాల్’

### నెల రోజుల్లో ప్రభుత్వ ఆస్పత్రులన్నింటిలో భద్రతా ఆడిట్లు

### ఆరు నెలలకోసారి ఫైర్, ఎలక్ట్రికల్ ఆడిట్ తప్పనిసరి


### ఏడాదికోసారి భవన నిర్మాణ భద్రతపై సమగ్ర తనిఖీ

### అత్యవసర తరలింపు ప్రణాళికలు.. క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్

### లోపాలను గుర్తించడమే కాదు.. గడువులోగా సరిచేయాలి: మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణ, రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెల రోజుల్లోగా ఫైర్, ఎలక్ట్రికల్, భవన నిర్మాణ భద్రతా ఆడిట్లను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో గురువారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆస్పత్రుల భద్రతపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇకపై ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఫైర్, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్లు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. భవనాల నిర్మాణ భద్రతపై ఏడాదికోసారి ప్రత్యేక ఆడిట్ చేపట్టాలని సూచించారు. ఫైర్ అలారాలు, అగ్నిమాపక పరికరాలు, హైడ్రెంట్లు, స్ప్రింక్లర్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, విద్యుత్ ప్యానళ్లు, వైరింగ్, జనరేటర్లు, ఏసీలు, ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలను తనిఖీ చేయనున్నారు. ఆడిట్లు నిర్వహించి నివేదికలు తయారు చేయడంతో సరిపెట్టొద్దని మంత్రి స్పష్టం చేశారు. గుర్తించిన లోపాలను తీవ్రత ఆధారంగా అత్యవసర, తక్షణ, సాధారణ విభాగాలుగా వర్గీకరించి నిర్ణీత గడువులోగా సరిచేయాలని ఆదేశించారు. ప్రాణాలకు ముప్పు కలిగించే లోపాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు. ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు, నియోనేటల్ ఐసీయూలు, రేడియాలజీ, డయాలసిస్, అత్యవసర చికిత్స విభాగాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను వేగంగా, సురక్షితంగా తరలించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడంతోపాటు ఆస్పత్రి సిబ్బందితో క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లాల స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో వైద్యారోగ్య, విద్యుత్, అగ్నిమాపక, రోడ్లు–భవనాల శాఖ అధికారులతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాల అమలును ఈ కమిటీలు నిరంతరం పర్యవేక్షించనున్నాయి. ఫైర్, ఎలక్ట్రికల్ భద్రతా పరికరాల నిర్వహణ, మరమ్మతులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కూడా నిర్ణయించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా పర్యవేక్షణ పెంచాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణతోపాటు ఆరోగ్య, విద్యుత్, రోడ్లు–భవనాలు తదితర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# 22ఏ భూముల రిజిస్ట్రేషన్లకు గ్రీన్‌సిగ్నల్

### జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులున్న ప్లాట్లకు అవకాశం

### 22ఏ జాబితాలో ఉన్నా ఆమోదిత లేఅవుట్లకు రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్, సెప్టెంబరు 24 (సమయం న్యూస్):** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి ప్రభుత్వ అధీకృత సంస్థల నుంచి అనుమతులు పొందిన నివాస ప్లాట్లు, లేఅవుట్ల భూములు 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ వాటి రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని ఆదేశించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రానుంది. గతంలో సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి లేఅవుట్ అనుమతులు పొందినప్పటికీ, ఆయా భూముల సర్వే నంబర్లు 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఇప్పటికే స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు వాటిని విక్రయించలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో ఆమోదిత లేఅవుట్లలోని అర్హత కలిగిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు మార్గం ఏర్పడింది. చెల్లుబాటయ్యే ఆమోదిత లేఅవుట్ ప్రణాళికలు, సంబంధిత అనుమతి పత్రాలు ఉన్న భూముల రిజిస్ట్రేషన్లు ఇక వేగవంతం కానున్నాయి. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న లావాదేవీలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ లావాదేవీలు పెరగడంతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో ప్రభుత్వ ఆదాయంపైనా ప్రభావం పడే అవకాశం ఉంది.

# దానం తీర్పుపై విపక్షాల 'సుప్రీం' అస్త్రం

- సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాన్ని స్వాగతించిన బీజేపీ, బీఆర్ఎస్
- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ నైతికతకు విజయమన్న రామచందర్‌రావు
- మిగతా ఫిరాయింపు ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించాలని డిమాండ్
- 'సంవిధాన్ బచావో' మాటలను ఆచరణలో చూపాలన్న హరీశ్‌రావు
- కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తున్న తీర్పంటూ విమర్శ






**దుబాయి/హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించడంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు స్పందించారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ప్రకటించగా, కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ మాటలకు ఇప్పుడు అసలు పరీక్ష ఎదురైందని బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. దానం పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసి, హైకోర్టు చట్టాన్ని సరిగానే అన్వయించిందని పేర్కొంది.

### 'అంతిమంగా సత్యానిదే గెలుపు'

దుబాయిలో ఉన్న రామచందర్‌రావు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. దీనిని ప్రజాస్వామ్యం, రాజ్యాంగ నైతికతకు దక్కిన విజయంగా అభివర్ణించారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాల్సిందేనన్న సందేశాన్ని తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ శాసనసభాపక్షం సాగించిన న్యాయపోరాటం ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువల పరిరక్షణకు దోహదపడిందని ఆయన వ్యాఖ్యానించారు. 'ఘర్ వాపసీ' పేరుతో పార్టీ ఫిరాయింపులను సమర్థించుకోలేరన్న విషయం ఈ తీర్పుతో స్పష్టమైందని రామచందర్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫిరాయింపులను ప్రోత్సహించారని ఆరోపించిన ఆయన.. కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించి తిరిగి ప్రజాతీర్పు కోరాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ విరుద్ధమని తాము భావించే ప్రభుత్వ చర్యలపై న్యాయస్థానాల్లోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఇవి రామచందర్‌రావు చేసిన రాజకీయ విమర్శలు, డిమాండ్లు.

### 'కాంగ్రెస్ మాటలకు ఇప్పుడు పరీక్ష'

మరోవైపు హరీశ్‌రావు స్పందిస్తూ.. దానం నాగేందర్ అనర్హతను సుప్రీంకోర్టు సమర్థించడం కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా మాట్లాడుతున్నారని, తెలంగాణలో కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల విషయంలోనూ అదే వైఖరిని ఆచరణలో చూపాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై నిబద్ధత ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ప్రజల తీర్పు కోరాలని రాహుల్‌గాంధీ సూచించాలని హరీశ్‌రావు అన్నారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడుతూ తెలంగాణలో తమ పార్టీ వ్యవహారంపై మౌనంగా ఉండటం సరికాదని విమర్శించారు. 'సంవిధాన్ బచావో' రాజ్యాంగ నిబద్ధతా? రాజకీయ నినాదమా? అన్నది కాంగ్రెస్ స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు దానం నాగేందర్ అనర్హత, ఖైరతాబాద్ స్థానం ఖాళీ కావడానికే ప్రత్యక్షంగా సంబంధించినది. ఇతర ఎమ్మెల్యేలపై అనర్హత లేదా రాజీనామా అంశాలను ఈ తీర్పు స్వయంగా నిర్ణయించలేదు; వారిపై రామచందర్‌రావు, హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ డిమాండ్లుగా చూడాల్సి ఉంటుంది.

# రిమ్స్ అగ్నిప్రమాదంపై 8 గంటల విచారణ

### తొలిరోజు విచారణ ముగించిన ఆరుగురు సభ్యుల ప్రత్యేక కమిటీ

### ప్రమాదం నాటి విధుల్లో ఉన్న సిబ్బందిని ప్రశ్నించిన సభ్యులు

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** ఆదిలాబాద్ రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ తొలిరోజు విచారణ ముగిసింది. సుమారు ఎనిమిది గంటలపాటు ఆరుగురు సభ్యుల కమిటీ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై వివరాలు సేకరించింది. అగ్నిప్రమాదం జరిగిన రోజు వార్డులో విధులు నిర్వర్తించిన సిబ్బందిని కమిటీ సభ్యులు విడివిడిగా ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగింది? మంటలను తొలుత ఎవరు గుర్తించారు? ఆ సమయంలో తీసుకున్న చర్యలేమిటి? చిన్నారులను తరలించడంలో ఎదురైన ఇబ్బందులేమిటి? తదితర అంశాలపై సమాచారం సేకరించినట్లు తెలిసింది. వార్డులో ఉన్న అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లను కమిటీ పరిశీలించింది. విద్యుత్ కేబుళ్ల పరిస్థితితోపాటు సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసింది. ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించేందుకు అవసరమైన వివరాలు, ఆధారాలను సేకరించిన అనంతరం ఎస్ఎన్‌సీయూ వార్డును మరోసారి సీజ్ చేశారు. రిమ్స్ ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన ఈ విషాద అగ్నిప్రమాదంలో ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఘటనకు దారితీసిన కారణాలు, భద్రతా పరమైన లోపాలు ఉన్నాయా అనే అంశాలపై ప్రత్యేక కమిటీ విచారణ కొనసాగనుంది.





# ప్రణయ్ హత్య కేసు ఖైదీ అబ్దుల్ బారీ మృతి

**నల్లగొండ, సెప్టెంబర్ 24 (ఉద్యమ కెటరం)** మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన అమృత ప్రణయ్ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (45) గురువారం మృతి చెందాడు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఉన్న ఆయన గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. గురువారం గుండెపోటుతో అస్వస్థతకు గురికావడంతో జైలు అధికారులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ జిల్లా కోర్టు 2025 మార్చి 11న అబ్దుల్ బారీతో పాటు మరో ముగ్గురికి శిక్షలు విధించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఘటనపై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

# ద్విచక్ర వాహనం ఢీకొని ఎస్సై మృతి

- గణేష్ నిమజ్జనోత్సవాల వేళ తీవ్ర విషాదం
- చికిత్స పొందుతూ మృతిచెందిన కొత్తగూడెం టూ-టౌన్ ఎస్సై కె.వెంకన్న
- ఎస్ఐ కుటుంబానికి అండగా ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనోత్సవాల విధుల్లో ఉన్న పోలీస్ అధికారి ప్రమాదవశాత్తూ దుర్మరణం చెందిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. ట్యాంక్ బండ్ ఎన్టీఆర్ మార్గ్‌లో నిమజ్జన బందోబస్తు విధుల్లో ఉన్న కొత్తగూడెం టూ-టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై కె.వెంకన్నను ఒక గుర్తుతెలియని స్కూటీ వేగంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి గణేష్ నిమజ్జన బందోబస్తు నిమిత్తం హైదరాబాద్ వచ్చిన ఎస్సై వెంకన్నను ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 2 సమీపంలో విధుల్లో నియమించారు. బుధవారం తెల్లవారుజామున విధి నిర్వహణలో ఉన్న సమయంలో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఆయనను ఢీకొట్టింది. ప్రాథమికంగా సాధారణ గాయాలుగానే భావించినప్పటికీ, ఆ తర్వాత ఆయనకు తీవ్ర అస్వస్థత, తల తిరగడం వంటి సమస్యలు తలెత్తడంతో సహచర పోలీసులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు.

### సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ఎస్ఐ వెంకన్న మృతిచెందడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకన్న మరణం ఆయన కుటుంబానికే కాకుండా రాష్ట్ర పోలీసు శాఖ మొత్తానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చిన సీఎం, బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ఎస్సై మృతికి కారణమైన నిందితుడిని వెంటనే గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.



# ఉప ఎన్నికకు సిద్ధం

### సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా: దానం నాగేందర్

- చట్టపరంగా ప్రయత్నించడంలో తప్పులేదని వ్యాఖ్య
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజల్లోకి వెళ్తానని స్పష్టీకరణ
- ఏ పార్టీ నుంచి పోటీ చేసేదీ షెడ్యూల్ తర్వాత చెబుతానన్న దానం
- జూబ్లీహిల్స్ ఫలితమే ఖైరతాబాద్‌లో పునరావృతమవుతుందని ధీమా

**హైదరాబాద్, సెప్టెంబరు 24 (సమయం న్యూస్):** ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రకటించారు. తన అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని, చట్టపరంగా ప్రయత్నించడంలో తప్పేమీ లేదని పేర్కొన్నారు. అందులో భాగంగానే న్యాయపోరాటం చేసినట్లు తెలిపారు. మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని సుప్రీంకోర్టు చెప్పిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మధ్యకు వెళ్తానని దానం నాగేందర్ తెలిపారు. తాను నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నానని, ఇకపైనా ప్రజాక్షేత్రంలోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తానన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారన్న ప్రశ్నకు ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాతే స్పష్టత ఇస్తానని చెప్పారు. అప్పటి పరిస్థితుల్లో ఎంపీగా పోటీ చేశానని, ఇప్పుడు కూడా ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. బీఆర్ఎస్‌పై ప్రస్తుతం ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని దానం చెప్పారు. ఖైరతాబాద్ ప్రజలకు ఎవరు అండగా ఉన్నారో తెలుసన్నారు. గెలిచినా, ఓడినా నియోజకవర్గ ప్రజలు తనతోనే ఉన్నారని పేర్కొన్నారు. గతంలో ఉప ఎన్నికలో ఓడిపోయినా ఆ తర్వాత రాజకీయంగా ప్రమోషన్ వచ్చిందని గుర్తుచేశారు. తాను ఖైరతాబాద్‌లోనే ఉండాలని, ఢిల్లీకి వెళ్లొద్దనే ఉద్దేశంతో ఎంపీ ఎన్నికల్లో ఓడించారని వ్యాఖ్యానించారు. తాను ఎంపీగా పోటీ చేసినప్పుడు కిషన్‌రెడ్డి భయపడ్డారా లేదా అన్నది ప్రజలకే తెలుసన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ ఫలితమే పునరావృతమవుతుందని దానం నాగేందర్ వ్యాఖ్యానించారు.

# 'చేయూత' దరఖాస్తుల పరిశీలనకు గడువు పొడిగింపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (ఉద్యమ కెటరం):** చేయూత సామాజిక భద్రత పెన్షన్లకు కొత్తగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఇప్పటివరకు ఈనెల 25 వరకు ఉన్న గడువును 30 వరకు మరో ఐదు రోజులు పొడిగిస్తూ 'సెర్ప్' సీఈవో దివ్య దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయి అధికారులు 'సర' విధులు, వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఇతర బాధ్యతల్లో నిమగ్నమై ఉండటంతో నిర్ణీత గడువులో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయలేకపోతున్నామని వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు చేయూత కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలనను పొడిగించిన గడువులోగా పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# రోడ్డు ప్రమాదాల నివారణకు కీలక నిర్ణయం

### టీజీ-టీమార్స్' ఏర్పాటు

### జీవో 135 విడుదల చేసిన సీఎస్



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్) :** రాష్ట్రంలో నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణ అంటే కేవలం చలానాలు వసూలు చేయడమే కాకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం, అత్యవసర వైద్య సాయం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో (టీజీ-టీమార్స్)ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అందుకు సంబంధించిన జీవో 135 విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడిచే రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి పరిధిలోనే ఈ కొత్త వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రత్యేక విభాగం అదనపు డీజీపీ లేదా ఐజీపీ స్థాయి అధికారి నేతృత్వంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుంది. రాష్ట్రంలోని 32 వేల కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉన్న రహదారులు, 1.8 కోట్లకు పైగా ఉన్న వాహనాల రాకపోకలను ఈ బ్యూరో పర్యవేక్షిస్తుంది. రోడ్డు రవాణాతోపాటు మెట్రో, రైల్వే భద్రతను కూడా ఈ విభాగానికే అప్పగించారు. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతీ పోలీస్ స్టేషన్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఒక రోడ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ ఆఫీసర్‌ను నియమిస్తారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో హాస్పిటల్‌కు తరలించడం వీరి బాధ్యత. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు, 50 కి.మీ కంటే ఎక్కువ ఉన్న హైవేలపై స్పీడ్ డిటెక్టర్లు, అత్యాధునిక కెమెరాలతో కూడిన హైవే పెట్రోలింగ్ యూనిట్లు నిరంతరం పహారా కాస్తారు. ఈ వ్యవస్థ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులకు వచ్చే ట్రాఫిక్ జరిమానాల మొత్తంలో 40% ఈ నిధికే మళ్లిస్తారు. ఈ నిధులను సిబ్బంది శిక్షణ, అధునాతన సాంకేతికత, పెట్రోలింగ్ వాహనాలు, అత్యవసర రోడ్డు మరమ్మతుల కోసమే ఉపయోగిస్తారు.

## సంపాదకీయం



# ఈసీ పారదర్శకతపై ప్రశ్నలు!?

భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణాధారం. ఎన్నికల్లో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అన్నది అంతిమంగా ప్రజల నిర్ణయం. అయితే ఆ నిర్ణయం స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా వెలువడిందన్న నమ్మకం ప్రజల్లో ఉండటం అంతకంటే ముఖ్యం. ఆ నమ్మకాన్ని కాపాడే అత్యంత కీలక రాజ్యాంగ సంస్థ ఎన్నికల సంఘం. అలాంటి సంస్థలోనే నిర్ణయాల ప్రక్రియపై అంతర్గత అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వచ్చిన తాజా కథనాలు సహజంగానే ఆందోళన కలిగిస్తున్నాయి. ఇండియన్ ఎక్స్ ప్రెస్ పరిశోధన ప్రకారం ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఓటర్ల జాబితాలు, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఫారం-6లో మార్పులు, ఎన్నికల డేటా నిర్వహణ వంటి అంశాలపై అభ్యంతరాలు నమోదు చేశారు. కొన్ని సందర్భాల్లో తమకు తెలియకుండానే నిర్ణయాలు తీసుకున్నట్లు వారు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. అయితే ఈ పరిణామాలపై ఎన్నికల సంఘం వివరణ కూడా ఇచ్చింది. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం సాధారణ ప్రక్రియలో భాగమేనని, అవి తుది నిర్ణయాలకు ముందు జరిగే అంతర్గత చర్చలేనని ఈసీ చెబుతోంది. గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా ఆమోదించినవేనని స్పష్టం చేసింది. ఇక్కడ అసలు ప్రశ్న ఎవరి వాదన నిజమన్నది మాత్రమే కాదు. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఎలా తీసుకుంటుంది? ఆ ప్రక్రియ ఎంత పారదర్శకంగా ఉంది? అన్నదే. ఓటర్ల జాబితా విషయంలో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఓటు హక్కు ఉన్న వ్యక్తి పేరు జాబితాలో లేకపోతే అతని ప్రజాస్వామ్య హక్కు ఆచరణలో అర్థరహితమవుతుంది. అదే సమయంలో అర్హత లేని పేర్లు జాబితాలో ఉండకుండా చూడటం కూడా ఎన్నికల సంఘం బాధ్యతే. అందుకే పేర్ల తొలగింపు, చేర్పు ప్రక్రియకు స్పష్టమైన ప్రమాణాలు, సమయానుకూల సమాచారం, అప్పీల్‌కు సులభమైన అవకాశం ఉండాలి. పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా తొలగించిన 27.16 లక్షల మంది ఓటర్లలో 22 లక్షలకు పైగా పునరుద్ధరణ కోసం అప్పీలు చేసుకున్నట్లు ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇది ఒక్కటే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎంత సున్నితమైనదో చెప్పడానికి సరిపోతుంది. ఇక సాంకేతిక వ్యవస్థల పాత్ర పెరుగుతున్న కొద్దీ మరో ప్రశ్న ముందుకొస్తోంది. ఓటర్ల డేటా, నమోదు, తొలగింపు వంటి కీలక ప్రక్రియల్లో సాఫ్ట్ వేర్ ఆధారిత నిర్ణయాలు పెరిగితే వాటిపై స్వతంత్ర తనిఖీ ఎలా ఉంటుంది? ఏ అధికారి ఏ నిర్ణయం తీసుకున్నారో, ఎందుకు తీసుకున్నారో భవిష్యత్తులో ఆడిట్ చేయగలిగే రికార్డు ఉంటుందా? ఓటరుకు తన పేరు ఎందుకు తొలగించబడిందో తెలుసుకునే హక్కు, దాన్ని సవాలు చేసే అవకాశం ఎంత సులభంగా ఉంటుంది?

### ఈ ప్రశ్నలకు సమాధానాలు ఉండాలి

ఎన్నికల అక్రమాల ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ వాటిని రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేయడం కూడా సరైన మార్గం కాదు. అదే సమయంలో నిర్ధారణ కాని ఆరోపణలను వాస్తవాలుగా ప్రచారం చేయడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ఆరోపణ ఏదైనా సరే, దానికి సంబంధించిన డేటా, పత్రాలు, ప్రక్రియలను పరిశీలించి నిజానిజాలు తేల్చే వ్యవస్థ బలంగా ఉండాలి. ఎన్నికల సంఘం మీద విమర్శలు రావడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం కాదు. విమర్శలకు సమాధానం చెప్పే పారదర్శక వ్యవస్థ లేకపోవడమే ప్రమాదం. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటే వాటిని సంస్థాగత చర్చలోనే పరిష్కరించుకోవచ్చు. కానీ ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాల్లో ఆ చర్చలకు సంబంధించిన విధానం, నిర్ణయానికి వచ్చిన కారణాలు, బాధ్యత వహించిన వ్యవస్థ ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి. అంతర్గత అభ్యంతరాలు నిజంగా సాధారణ ప్రక్రియలో భాగమే అయితే, వాటిని దాచాల్సిన అవసరం కూడా ఉండదు. అవి నిర్ణయ ప్రక్రియను మరింత మెరుగుపరిచేలా ఉపయోగపడాలి. భారత ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉండటం ఎన్నికల సంఘానికి మాత్రమే అవసరం కాదు. అధికార పక్షానికి, ప్రతిపక్షానికి, అభ్యర్థులకు, ఓటర్లకు సమానంగా అవసరం. ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ కూడా ఫలితాన్ని అంగీకరించగలగాలి. గెలిచిన పార్టీ కూడా ఆ విజయం ప్రజల స్వేచ్ఛాయుత తీర్పు వల్లే వచ్చిందన్న నమ్మకంతో ఉండాలి. అందుకే ఎన్నికల సంఘంపై ప్రస్తుతం తలెత్తిన ప్రశ్నలను రాజకీయ పోరాటానికి మాత్రమే పరిమితం చేయకుండా సంస్థాగత సంస్కరణలకు అవకాశంగా చూడాలి. ఓటర్ల జాబితాల సవరణకు మరింత పారదర్శక విధానం, డిజిటల్ వ్యవస్థల స్వతంత్ర ఆడిట్, నిర్ణయాలపై స్పష్టమైన రికార్డింగ్, ఫిర్యాదుల పరిష్కారానికి వేగవంతమైన వ్యవస్థ, అవసరమైన చోట న్యాయపరమైన పర్యవేక్షణ వంటి చర్యలు ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయగలవు. ఎన్నికల సంఘం మీద విశ్వాసం అంటే ఒక వ్యక్తి మీద లేదా ఒక కమిషనర్ మీద విశ్వాసం కాదు. అది భారత ఎన్నికల ప్రక్రియ మీద విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. అలాగే ఎన్నికల అక్రమాలపై ఆరోపణలు చేసే రాజకీయ పక్షాలు కూడా ఆధారాలతో మాట్లాడాల్సిన బాధ్యతను గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో తుది అధికారం ఓటరుదే. ఆ ఓటు ఎవరిది, అది ఎలా నమోదైంది, ఎందుకు తిరస్కరించబడింది, ఎన్నికల ఫలితం ఎలా వచ్చింది అన్న ప్రతి దశపై ప్రజలకు నమ్మకం ఉన్నప్పుడే ఆ తీర్పుకు పూర్తి విలువ ఉంటుంది. ఎన్నికలు నిర్వహించడం మాత్రమే ఎన్నికల సంఘం బాధ్యత కాదు. ఎన్నికలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటమే దాని అసలు పరీక్ష.

# ‘ఓటు చోరీ’తో గెలిస్తే.. ఆ చట్టాలూ చెల్లవు!

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి
- సీఈసీ అప్రూవర్‌గా మారడం దేశ ప్రయోజనాలకు మంచిది
- ఢిల్లీ మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘంలో తీవ్ర విభేదాలు, అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనాలు వెలువడటంతో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ‘ఓటు చోరీ’ ద్వారా అక్రమంగా ఎంపీలుగా గెలిచిన వారు పార్లమెంట్‌లో చేసే చట్టాలకు చెల్లుబాటు ఉండదని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల తొలగింపు, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ బహిరంగంగా లేవనెత్తిన తర్వాతే, కమిషన్‌లోని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు (సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి) ఓటర్ల జాబితాల సవరణపై సీఈసీకి తమ తీవ్ర అభ్యంతరాలను తెలిపారని గుర్తుచేశారు. ఈ మొత్తం వ్యవహారంపై జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారి నిజాలు వెల్లడించడం దేశ ప్రజాస్వామ్య ప్రయోజనాలకు ఎంతో మంచిదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### మోదీ, అమిత్‌షా బాధ్యత వహించాలి

ఎంతటి బలమైన నాయకులైనా కొన్నేళ్ల పాలన తర్వాత వారిపై ప్రజా వ్యతిరేకత రావడం నైజమని, అయితే ఆ ప్రజా ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకు బీజేపీ ప్రభుత్వం ‘ఓటు చోరీ’ వంటి అక్రమ మార్గాలను ఎంచుకుంటోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ద్వయమే ఎంపిక చేసిందని ప్రస్తావించారు. కమిషన్‌లో నెలకొన్న ప్రస్తుత గందరగోళానికి, అవసవ్యతలకు సీఈసీయే కారణమని ఇద్దరు కమిషనర్లు స్పష్టం చేస్తున్నందున, ఆయనను ఎంపిక చేసిన ప్రధాని, హోంమంత్రులే దీనికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# ఆ వినాశకర సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలి

- దేశ ప్రజలకు ఈసీ క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ డిమాండ్
- ఢిల్లీ కేంద్రంగా నియంత్రిస్తున్న ‘ECINet App’ పై తీవ్ర దుమారం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** ఎన్నికల సంఘం ఉపయోగిస్తున్న ‘జుజ×చీవ్ ాజూజూ’ సాఫ్ట్‌వేర్ వివాదాస్పదంగా మారిందని, పౌరుల రాజ్యాంగ హక్కులను హరించే ఈ వినాశకరమైన సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ సీనియర్ ఎంపీ శశిథరూర్ తీవ్రస్థాయిలో పిలుపునిచ్చారు. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు వంటి కీలక ప్రక్రియలను ఎన్నికల కమిషనర్లకు తెలియకుండానే చేపడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో గోవాలో వెలుగుచూసిన పరిణామాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా గోవాలో కొందరు ఓటర్ల వివరాల్లో సాంకేతిక వైరుధ్యాలను డేటాబేస్ గుర్తించింది. అయితే, క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఓటరు నమోదు అధికారులు అందులోని 97 మంది పౌరులు ఓటరు జాబితాలో ఉండటానికి సంపూర్ణ అర్హులని నిర్ధారించారు. కానీ, వారి పేర్లను పునరుద్ధరించేందుకు స్థానిక అధికారులకు యాప్‌లో ఎలాంటి ఆప్షన్ అందుబాటులో లేకుండా చేశారు. దీనిపై గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఏడు రోజుల వ్యవధిలో ఏకంగా 8 సార్లు ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాసినప్పటికీ, అక్కడి నుంచి ఎలాంటి అనుమతి లభించలేదు. ఫలితంగా అర్హులైన 97 మంది పౌరులు ఓటరు జాబితా నుంచి వైదొలగాల్సి వచ్చింది.

### ఓటు హక్కుతో పాటు వైద్యానికీ దూరం:

ఈ వ్యవహారంపై ఎంపీ శశిథరూర్ తన ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. “గోవాలో ఓటరు జాబితాలో పేరు లేకపోవడం అంటే కేవలం ఓటు హక్కును కోల్పోవడమే కాదు.. సూపర్ స్పెషాలిటీ చికిత్సలు, డయాలసిస్, అవయవ మార్పిడి వంటి అత్యవసర సేవలను అందించే ప్రభుత్వ మెడిక్లెయిమ్ పథకాల ప్రయోజనాల నుంచి కూడా పౌరులను దూరం చేయడమే” అని మండిపడ్డారు. రాజకీయ కుతంత్రాలే దారుణమనుకుంటే, పౌరుల ప్రాథమిక హక్కులను, ఆరోగ్య భద్రతను హరించే ఇలాంటి అమానవీయ ప్రవర్తనను ఎంతమాత్రం సహించలేమని ఆయన స్పష్టం చేశారు. ఈ దారుణ తప్పిదానికి గాను కేంద్ర ఎన్నికల సంఘం దేశ ప్రజలకు, బాధితులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని, డిజిటల్ వ్యవస్థ పేరుతో కలిగించిన నష్టాన్ని తక్షణమే సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

# 48 గంటల్లో రాజీనామా చేయాలి

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు కాక్రోచ్ జనతా పార్టీ అల్టిమేటం
- లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరిక
- రాజీనామా చేసే వరకు వెనక్కి తగ్గేది లేదన్న అభిజీత్ దీప్కే



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లోగా పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. నిర్ణీత గడువులోగా ఆయన పదవి నుంచి తప్పుకోకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన ప్రారంభిస్తామని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని గురువారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించారు. “48 గంటల్లో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్త ఆందోళన ప్రారంభిస్తుంది. ఆయన రాజీనామా చేసే వరకు వెనక్కి తగ్గేది లేదు” అని దీప్కే ప్రకటించారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం సీఈసీ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌పై దీప్కే తీవ్ర పదజాలంతో విమర్శలు చేశారు. ఆయనను ‘జాతి వ్యతిరేకి’గా అభివర్ణించడంతోపాటు భారత ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారారని ఆరోపించారు. ఇవి దీప్కే చేసిన రాజకీయ ఆరోపణలే తప్ప నిర్ధారిత వాస్తవాలు కావు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో ఓటర్ల జాబితాల సవరణకు సంబంధించిన వివిధ అంశాలపై కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలు, సూచనలు నమోదు చేసినట్లు వచ్చిన మీడియా కథనాలను దీప్కే ప్రస్తావించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల సంఘం నిర్ణయాలపై పారదర్శక విచారణ జరగాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. అయితే ఎన్నికల సంఘం ఈ వ్యవహారంపై భిన్నమైన వివరణ ఇచ్చింది. కమిషనర్ల మధ్య భిన్నమైన అభిప్రాయాలు, సూచనలు రావడం నిర్ణయ ప్రక్రియలో సహజమని, తుది నిర్ణయాలు పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్నవేనని పేర్కొంది.

### ‘13 కోట్ల ఓట్లు తొలగించారు’ అంటూ ఆరోపణ

దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు తొలగించారని దీప్కే ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికార, విపక్ష కూటముల మధ్య ఓట్ల తేడాను ప్రస్తావిస్తూ.. భారీ సంఖ్యలో ఓటర్ల పేర్ల తొలగింపు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అంశమని ఆయన వాదించారు. అయితే 13 కోట్ల ఓటర్ల తొలగింపుపై దీప్కే పేర్కొన్న సంఖ్యను ఆయన ఆరోపణగానే చూడాలి; అది అక్రమంగా తొలగించిన ఓట్ల సంఖ్యగా స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు.

### మూడు ప్రధాన డిమాండ్లు

సీఈసీ రాజీనామాతోపాటు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేయడం, దానిపై స్వతంత్ర విచారణ జరిపించడం వంటి డిమాండ్లను సీజేపీ ముందుంచింది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని మార్చి, ప్రజల్లో విశ్వాసం కలిగించే స్వతంత్ర ఎంపిక ప్రక్రియను తీసుకురావాలని కూడా కోరింది.

# అమెరికా, జపాన్‌లోనూ ఇలాంటివి జరుగుతాయి

### బాలికలపై వరుస వేధింపులపై బీహార్ మంత్రి అశోక్ చౌదరి



**పాట్నా, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** బీహార్‌లోని జమూయి, సమస్తిపూర్, దర్భంగా జిల్లాల్లో వరుసగా బాలికలు, మహిళలపై లైంగిక వేధింపుల ఘటనలు వెలుగుచూడటంపై జేడీయూకి చెందిన బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అశోక్ చౌదరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. భారతదేశం కంటే ఎంతో అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లోనూ లైంగిక వేధింపులు, నేరాలు జరుగుతుంటాయని, ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా ప్రతికూల కథనాలు సృష్టించవద్దని ఆయన జర్నలిస్టులను హెచ్చరించారు. పాట్నాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీహార్‌లో మరువక ముందే జరుగుతున్న వరుస వేధింపుల ఘటనలపై విలేకరులు ప్రశ్నించగా మంత్రి ఘాటుగా స్పందించారు. “14 కోట్ల జనాభా ఉన్న బీహార్ రాష్ట్రంలో దుర్మార్గులు, చదువురానివారు, అజ్ఞానులు, అసభ్యంగా ప్రవర్తించేవారు, సంస్కారం లేనివారికి కొదవలేదు. వీరు చట్ట పాలనను దెబ్బతీస్తూ రాష్ట్రానికి చెడ్డపేరు తెస్తున్నారు. అయితే, నేరాలు ఎక్కడ జరగవు? మనకంటే అభివృద్ధి చెందిన అమెరికా, జపాన్లలోనూ ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉంటాయి” అని వ్యాఖ్యానించారు.

### ప్రభుత్వ చర్యలు, చట్ట బద్ధతపై వివరణ

ప్రభుత్వం నేరస్థులను కాపాడే ప్రయత్నం చేస్తోందా లేక చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందా అనేదే అసలైన ప్రశ్నని పేర్కొన్న మంత్రి, జమూయి ఘటనలో 24 గంటల్లోపు, సమస్తిపూర్‌లో 12 గంటల్లోపు పోలీసులు నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. రేపటి నుంచి సమాజంలో ఇలాంటి ఘటనలు పూర్తిగా ఆగిపోతాయని ఏ ముఖ్యమంత్రినైనా, ప్రపంచ దేశాల నాయకుడైనా హామీ ఇవ్వలేరని స్పష్టం చేశారు. అయితే, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏదైనా నేరం జరిగితే, నిందితులపై చట్టం తన పూర్తి శక్తితో ఒక ‘బుల్డోజర్’లా విరుచుకుపడుతుందని, ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు, మహిళా సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, బాధ్యతారాహిత్యంగా సమాధానాలు ఇస్తూ విదేశాలతో పోల్చడం దారుణమని ఆక్షేపించాయి.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 57వ ఎన్ఎస్ఎస్ డే వేడుకలు




**ఆలేరు, సెప్టెంబర్ 24(సమయం న్యూస్):** 57వ ఎన్ఎస్ఎస్ డే పురస్కరించుకొని గురువారం ఆలేరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవిర్భావ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ప్రాధాన్యత, సామాజిక బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. రాజారాం అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. సమాజ సేవలో చురుకుగా పాల్గొంటూ స్వచ్ఛ భారత్, డ్రగ్స్ అవేర్నెస్, ఎయిడ్స్ అవేర్నెస్ వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణ పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నల్లబోలు ముత్యాలు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ డే ఆవిర్భావం, ఎన్ఎస్ఎస్ లక్ష్యాలు, వాలంటీర్లకు నిర్వహించే వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. ఇంటిగ్రేషన్ క్యాంపులు, స్పెషల్ క్యాంపులు, రెగ్యులర్ యాక్టివిటీస్ ద్వారా విద్యార్థులకు సామాజిక సేవపై ప్రత్యక్ష అనుభవం లభిస్తుందని తెలిపారు. సమాజ సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇన్ మల్లేశం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎన్.సి. సౌజన్య, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. రవీందర్, అధ్యాపకులు ప్రొఫెసర్ భారతి, నందకుమార్, వెంకటేశ్వర్లు, జానయ్య, జ్యోతి, చైతన్య, అనిత, లక్ష్మి, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# సెరికల్చర్ వైపు రైతులు మళ్లాలి

- **ప్రత్యామ్నాయ పంటలతో వాతావరణ ప్రతికూల పరిస్థితులను అధిగమించాలి.**
- **సెరికల్చర్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం**
- **జిల్లా కలెక్టర్ ప్రియాంక.**

**గుండుమాల్ మండలం, సెప్టెంబర్24(సమయం న్యూస్)**

జిల్లాలోని రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా సెరికల్చర్ (పట్టు పురుగుల పెంపకం) వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. గురువారం నారాయణ పేట జిల్లా/కొడంగల్ నియోజక వర్గం గుండుమల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మల్బరీ సాగుకు ప్రోత్సాహకాలు పట్టు రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు కొడంగల్, కోస్గి, గుండుమల్ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో రైతులు మల్బరీ సాగు, టస్సర్ తదితర సెరికల్చర్ కార్యకలాపాలు చేపట్టి మంచి ఫలితాలు సాధించారని, ప్రస్తుతం వివిధ కారణాల వల్ల రైతులు ఎక్కువగా వరి సాగువైపు మళ్లారని తెలిపారు.వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యత వంటి అంశాల నేపథ్యంలో వరి సాగుతో ఎదురయ్యే ఇబ్బందులను రైతులకు వివరిస్తూ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల రైతులు మిల్లెట్స్ తదితర ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లుతున్నారని తెలిపారు.సెరికల్చర్కు అనుకూలమైన వాతావరణం, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మల్బరీ తోటలను తిరిగి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సెరికల్చర్ను ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కోస్గి ప్రాంతానికి హైదరాబాద్ నుంచి రేడియల్ రోడ్ అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సెరికల్చర్ సాగును విస్తరించి, రీలింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి ఉత్పత్తిని పెంచితే రైతులకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన పట్టు కు మార్కెట్లో డిమాండ్ ఉందని, రైతులు ఉత్పత్తిని పెంచే దిశగా ముందుకు సాగాలని కోరారు.ఇప్పటికే సెరికల్చర్పై ఆసక్తి చూపుతున్న రైతులతో సమావేశాలు నిర్వహించగా సుమారు 100 మంది రైతులు ముందుకు వచ్చి, ప్రభుత్వం నుంచి అవసరమైన సబ్సిడీలు, సహకారం అందిస్తే వచ్చే సీజన్లో మల్బరీ మొక్కల సాగు చేపట్టి ఉత్పత్తిని ప్రారంభిస్తామని తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు.సెరికల్చర్కు సంబంధించి డ్రిప్ సౌకర్యం, మల్బరీ మొక్కలు, ఇతర అవసరమైన సామగ్రిని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు ఈ సీజన్లోనే సెరికల్చర్ వైపు అడుగులు వేయాలని కోరారు.అలాగే అహింసా సిల్క్కు మార్కెట్లో ప్రత్యేక డిమాండ్ ఉందని, పట్టుపురుగులకు హాని కలిగించకుండా తయారు చేసే ఈ రకమైన పట్టుకు హైదరాబాద్తో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వినియోగదారులు ఉన్నారని తెలిపారు. ఇంటర్నెట్, ఈ-కామర్స్ వంటి సౌకర్యాల ద్వారా దేశవ్యాప్తంగా,అంతర్జాతీయ స్థాయిలో కూడా ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే అవకాశం ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు.సెరికల్చర్లో విజయవంతంగా సాగు చేస్తున్న రంగారెడ్డి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు రైతులను అధ్యయన పర్యటనకు తీసుకెళ్లి, అక్కడి సాగు విధానాలు, సాంకేతికత,మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పిస్తామని కలెక్టర్



తెలిపారు.చాకీ సెంటర్ల ఏర్పాటుకు మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు స్థానికంగా శిక్షణ ఇవ్వడంతో పాటు, అవసరమైతే మైసూరులో మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చాకీ సెంటర్ల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న మహిళా సంఘాల సభ్యులు ముందుకు రావాలని కోరారు. సెరికల్చర్కు అవసరమైన డ్రిప్ సదుపాయాలు, అదనపు సబ్సిడీలు, మొక్కల సరఫరా, ఇతర అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని జిల్లాకు అవసరమైన సహకారాన్ని తీసుకువస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం రైతులకు పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని, రైతులు ముందుకు రావడమే ప్రధాన అవసరమని అన్నారు.వాతావరణ ప్రతికూల పరిస్థితులు, వర్షాభావం వంటి పరిస్థితులు ఎదురైనప్పుడు రైతులపై ప్రభావం తగ్గేలా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. రాబోయే ఏడాది కాలంలో జిల్లాలో సెరికల్చర్ సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో రైతులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు.సెరికల్చర్ను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడంతో పాటు, జిల్లాలో ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ పట్టు పురుగు జీవిత చక్రము ప్రదర్శనను తిలకించారు.ఈ సదస్సులో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, సెరి కల్చర్ డీ డీ నాగరత్న, ఏ డీ లు విజయ్ కుమార్,మహిపాల్, మండల ప్రత్యేక అధికారి రంగారావు, సర్పంచి శ్రీశైల, వ్యవసాయ శాఖ ఏ వో రేష్మా రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.◌ాదాలపై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఎస్సై చంద్రశేఖర్ మాట్లాడుతూ... మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం, మైనర్లు స్వయంగా వాహనాలు నడపడం చట్టపరంగా తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనకు దారితీస్తుందని తెలిపారు. ముఖ్యంగా స్కూల్ విద్యార్థులు సరైన డ్రైవింగ్ అనుభవం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని, స్కూల్ యాజమాన్యాలు కూడా విద్యార్థులు వాహనాలతో పాఠశాలకు రావడం లేదా ప్రమాదకరంగా వాహనాలు నడపకుండా అవగాహన కల్పించాలని సూచించారు.ఇకపై ఇదే తరహా ఘటనలు పునరావృతమైతే కేవలం విద్యార్థులకు కౌన్సెలింగ్తో సరిపెట్టకుండా, నిబంధనల ప్రకారం తల్లిదండ్రులు, సంబంధిత బాధ్యత వహించాల్సిన స్కూల్ యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

# యూత్ ఫర్ సేవా .. తెలంగాణ విద్యావంతుల వేదిక సహకారం అభినందనీయం

- **తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కే రవీందర్ గౌడ్**

**దూద్యాల మండలం, సెప్టెంబర్,24(సమయం న్యూస్)**



వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని జడ్.పి.హెచ్.ఎస్ దుద్యాల మరియు జడ్.పి.హెచ్.ఎస్ హకీంపేట్ జడ్.పి.హెచ్.ఎస్ చిలుమల మైలారం పాఠశాలలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థి ని విద్యార్థుల కొరకు గురువారం ఎన్.ఎం.ఎం.ఎస్ స్టడీ మెటీరియల్ అందించడం జరిగింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అకింపేటలో 11మంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుద్యాలలో 14 మంది చిల్ముల్ మైలవరంలో 23 మంది విద్యార్థు లు పరీక్షలకు హాజరు అవుతున్న సందర్భంలో వారందరూ జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షకు సన్నద్ధం కావడానికి స్టడీ మెటీరియల్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ విద్యావంతులు వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదివే విద్యార్థి విద్యార్థులు ఇప్పటినుండే జాతీయ స్థాయి పోటీ పరీక్షలను ఎదుర్కొనే సామర్థ్యాలను పెంపొందించడానికి జాతీయస్థాయిలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుందని ఈ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థి ని విద్యార్థులకు 9 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు నాలుగు సంవత్సరాలు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయల చొప్పున భారత ప్రభుత్వం స్కాలర్షిప్ అందిస్తుందని తెలియజేశారు ఈ సందర్భంగా యూత్ ఫర్ సేవా సభ్యులు సతీష్ మరి పుండరీకాక్ష గారికి ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో దుద్యాల మండల క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు మల్లప్ప మాట్లాడుతూ, విద్యార్థులు పోటీపరీక్షలకు సన్నద్ధం కావడం దానికి అనుగుణంగా యూత్ ఫర్ సేవ తెలంగాణ విద్యావంతుల వేదిక ఉమ్మడిగా గ్రామీణ ప్రాంతాలలో ఉండే విద్యార్థి ని విద్యార్థులకు ప్రోత్సాహం ఇస్తూ వారికి స్టడీ మెటీరియల్ అందించడం చాలా సంతోషము అన్నారు ఈ కార్యక్రమంలో హకీంపేట్ పాఠశాల ఉపాధ్యాయులు కూర నరసింహులు గారు మరియు చిల్ముల్ మైలారం ప్రధానోపాధ్యాయులు యాదయ్య గారు మరియు ఉపాధ్యాయులు హనుమంతు దుద్యాల ఉపాధ్యాయులు రాములు, ముకుంద రెడ్డి, శ్రీనివాస్ ,సుధాకర్ రావు, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు యూత్ ఫర్ సేవా సంస్థను తెలంగాణ విద్యావంతుల వేదిక సభ్యులను అభినందించారు

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 24( సమయం న్యూస్):** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడంతో పాటు హాస్టల్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సిరిసిల్లలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించారు. మెనూ చార్ట్ను తనిఖీ చేసి, కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు, కూరగాయలు తదితర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం వసతి గదులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యార్థు లు హాస్టల్ లో కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## త్వరలో మెదక్లో కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం



**మెదక్, సెప్టెంబర్ 24( సమయం న్యూస్)** స్కూల్ బ్రేక్ఫాస్ట్ ప్రోగ్రామ్ లో భాగంగా మెదక్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ను త్వరలో ప్రారంభించనున్నారు. ఈ కిచెన్ ద్వారా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల పరిధిలోని 395 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 29,183 మంది విద్యార్థులకు ప్రతిరోజూ పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించనున్నారు. NIN సహకారంతో రూపొందించిన మెనూ ప్రకారం రోజుకో వెరైటీ అల్పాహారం, రోజు విడిచి రోజు పాలు అందిస్తారు. విద్యార్థుల ఆరోగ్యం, హాజరు, చదువుపై ఏకాగ్రత పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యం.

## కంటైనర్ పాఠశాలను ప్రారంభించిన మంత్రి సీతక్క



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 24( సమయం న్యూస్)**: ఏటూరునాగారం మండలం మామిడిగూడెం గ్రామంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రూ.15 లక్షల సీఐఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి పాఠశాలను ప్రారంభించిన అనంతరం మంత్రి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూస్ పంపిణీ చేసి, వారితో కలిసి అల్పాహారం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణబాబు, మండల విద్యాధికారి, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ప్యానల్ ఇన్స్పెక్షన్ అంశాలపై సమీక్ష-డీఆర్పీ గౌరరం గోపాల్



**బొంరస్ పేట మండలం, సెప్టెంబర్,24(సమయం న్యూస్)** బొంరస్ పేట మండలవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ప్యానల్ ఇన్స్పెక్షన్ సందర్భంగా పరిశీలించిన అంశాలపై డీఆర్పీ గౌరారం గోపాల్ వివరించారు.బొంరస్ పేట పట్టణంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్యానల్ ఇన్స్పెక్షన్లో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన స్థాయిలు, ఎఫ్ఎల్ఎన్ అమలు, విద్యార్థుల హాజరు, బోధన–అభ్యసన ప్రక్రియ, తరగతి గది నిర్వహణ, తల్లిదండ్రుల సమావేశాలు, విద్యార్థుల ప్రగతి తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు.సమావేశంలో సిఆర్పి ప్రధానోపాధ్యాయులు రవీందర్ గౌడ్ ఆర్పీలు జీవన్ అన్వర్ నవీన్ ఉపాధ్యాయులు, సీఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

సమయం



## భూమి ఉన్న ప్రతి రైతూ ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలి

ఈ నెల 30లోగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలి: ఏఈఓ భార్గవి



**ఆలేరు, సెప్టెంబర్ 24(సమయం న్యూస్):** భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ లోనమోదు చేసుకుని ఫార్మర్ ఐడీ పొందాలని శరాజీపేట వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) భార్గవి సూచించారు. ఈ నెల 30వ తేదీలోగా రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఆలేరు మండలం శరాజీపేట గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక శిబిరంలో ఏఈఓ భార్గవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా రైతుల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 2026 ఆగస్టు 13వ తేదీ వరకు భూమి రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలకు కీలకం ఫార్మర్ రిజిస్ట్రేషన్ లో భాగంగా రైతుల వ్యక్తిగత వివరాలు, ఆధార్ సంఖ్య, భూమికి సంబంధించిన వివరాలను నమోదు చేసిన అనంతరం ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు సంఖ్యను జారీ చేస్తుందని తెలిపారు. ఈ ఫార్మర్ ఐడీ భవిష్యత్తులో రైతులకు అందే వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు పంటల నమోదు, పంటల కొనుగోలు, విక్రయాలు, విత్తనాలు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో కీలకంగా ఉంటుందని వివరించారు. ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రే షన్ చేసుకోని రైతులు ఆలస్యం చేయకుండా తమ సమీపంలోని వ్యవసాయ కార్యాలయం, మీ–సేవ కేంద్రం లేదా సీఎస్ సీ కేంద్రాన్ని సంప్రదించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఏఈఓ భార్గవి కోరారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంతి మధు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మహిళలు చైతన్యం కావాలి

- ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న OMIF సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె.నారాయణ





**కోస్గి మున్సిపల్,సెప్టెంబర్,24(సమయం న్యూస్)** నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీలోని అంగన్వాడీ కేంద్రం దగ్గర OMIF (ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్) అధ్వర్యంలో మహిళలకు ప్రభుత్వ పతాకాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంకి ముఖ్య అతిథిగా OMIF సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె. నారాయణ హాజరై మాట్లాడుతూ, OMIF సంస్థ ఉమ్మడి జిల్లాలో 350 గ్రామాల్లో మహిళల సంక్షేమం బాలికలకు సంబంధించిన వొకేషనల్ ట్రేనింగ్స్ మహిళల ఆరోగ్య సంరక్షణ పై అవగాహన కల్పించడం కార్యక్రమలు చేస్తుంది మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నాయని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి ప్రతి మహిళా చదువుకోవాలి మూఢనమ్మకాలు పాటించారాదు ఆడపిల్లలను చదివించాలి పిల్లలపై వివక్ష చూపరాదని అన్నారు.అలాగే నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ శ్రావణి లేబర్ కార్డు ఉపయోగాల పై అవగాహన కల్పించడం జరిగింది ప్రతి మహిళా లేబర్ కార్డు కలిగి ఉంటే ఇన్సూరెన్స్ పాలసీ కుటుంబానికి అందుతుందని అన్నారు మానసిక ఆరోగ్య సమస్యలు పరిష్కారం పై గౌతమి ఆవగహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో OMIF మండల కోఆర్డినేటర్ లు ఈశ్వరమ్మ ఈశ్వప్ప ఆరోగ్య కార్యకర్తలు. మొగలమ్మ పద్మ సులోచన శారద అశమ్మ నర్సమ్మ వివిధ గ్రామాల. మహిళలు పాల్గొన్నారు.

## ఈనెల 27న యాదగిరిగుట్ట లో జరిగే ఆవిర్భవ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి



**వలిగొండ సెప్టెంబర్ 24 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఉద్యమకారుల ఫోరం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, గౌరవాధ్యక్షుడు కళ్లెం లక్ష్మారెడ్డి లు పిలుపునిచ్చారు. గురువారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుల ఆకాంక్షలకై గత తొమ్మిది సంవత్సరాలుగా డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి ఉద్యమకారుల హక్కులను మేనిఫెస్టోలో పెట్టించిన ఘనత ఉద్యమకారుల పోరందేనని, ఈనెల 27న యాదగిరిగుట్టలో లక్ష్మి నరసింహ ఫంక్షన్ హాల్ జిట్టా బాలకృష్ణా రెడ్డి ప్రాంగణంలో జరిగే తొమ్మిదవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుండి ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారుడు బొడిగె సుదర్శన్ గౌడ్, చిలుగూరి సత్తిరెడ్డి,కదిరేణి స్వామి, ఐటి పాముల పుష్పమ్మ, కన్నె కంటి శ్రీనివాసచారి, కొండూరు శ్రీరాములు, సత్తయ్య, పల్లెర్ల రామచంద్రం, దండ మల్లికార్జున్, ఉక్కుర్తి స్వామి, పారుపల్లి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న 108 సిబ్బంది

- ప్రమాద బాధితుడి రూ.15 వేల నగదు, మొబైల్ ఆసుపత్రి సిబ్బందికి అప్పగింత



**ఆలేరు, సెప్టెంబర్ 24(సమయం న్యూస్):** ప్రజాసేవతో పాటు మానవత్వాన్ని చాటుకున్నారు 108 సిబ్బంది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సకాలంలో ప్రథమ చికిత్స అందించడమే కాకుండా, అతని వద్ద లభించిన రూ.15 వేల నగదు, మొబైల్ ఫోన్‌ను భద్రంగా ఆసుపత్రి సిబ్బందికి అప్పగించారు. జనగామ జిల్లా వడ్లకొండ గ్రామానికి చెందిన మహేష్ మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి తన స్వగ్రామమైన వడ్లకొండకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో ఆలేరు పరిసర ప్రాంతాల్లో బైక్ అదుపుతప్పి జారిపడటంతో ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన మహేష్ అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన మహేష్‌కు అవసరమైన ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగిన ప్రదేశంలో స్థానికులకు మహేష్ వద్ద ఉన్న రూ.15 వేల నగదు, మొబైల్ ఫోన్ లభించాయి. వాటిని ఆలేరు 108 సిబ్బందికి అప్పగించారు. 108 సిబ్బంది ఈఎంటీ వెంకటేష్, పైలెట్ ప్రశాం త్‌లు నగదు, మొబైల్ ఫోన్‌ను భద్రంగా ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. ప్రమాద సమయంలో బాధితుడికి ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు తక్షణ వైద్య సహాయం అందించడంతో పాటు, అతని నగదు, మొబైల్‌ను భద్రంగా అప్పగించిన 108 సిబ్బందిని ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు అభినందించారు. ప్రజాసేవలో నిబద్ధతతో పాటు నిజాయితీ, మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు.

# ప్రపంచ హార్ట్ డే ర్యాలీలో వక్తల పిలుపు



**ఆలేరు, సెప్టెంబర్ 24(సమయం న్యూస్):** మారుతున్న జీవనశైలి నేపథ్యంలో హృదయ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు సూచించారు. ప్రపంచ హార్ట్ డేను పురస్కరించుకుని రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ, మెడిసిటీ హాస్పటల్స్, మెడినోవా హాస్పటల్స్ ఆధ్వర్యంలో గురువారం ఆలేరులో హృదయ ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల వరకు కొనసాగింది. విద్యార్థులు, వైద్య సిబ్బంది, ప్రజలు ర్యాలీలో పాల్గొని హృదయ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజని బాలమణి మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు పొగతాగడం, ఇతర అనారోగ్యకరమైన అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రజల్లో హృదయ ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఆలేరు ఎస్‌హెచ్‌ఓ జి. ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ ఆరోగ్యమే ప్రతి వ్యక్తికి ప్రధాన సంపద అని అన్నారు. గుండెపోటు లక్షణాలను ముందుగానే గుర్తించి, సకాలంలో వైద్య సహాయం పొందడం ఎంతో ముఖ్యమని తెలిపారు. యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శారీరక వ్యాయామం, సమతుల్య ఆహారం, ఒత్తిడి నియంత్రణను రోజువారీ జీవనశైలిలో భాగం చేసుకోవాలని చెప్పారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచేందుకు రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు. రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుండె జబ్బులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలను పాటించడం ద్వారా గుండె సంబంధిత సమస్యలను నియంత్రించుకోవచ్చని తెలిపారు. ప్రపంచ హార్ట్ డే సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, కౌన్సిలర్లు యాట శివ, మల్లెల సరిత, శ్రీకాంత్, మౌనిక, హరీష్, మంగ నరసింహులు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, బీజేపీ నాయకులు తునికి దశరథ్, వడ్డెమాను నరేందర్, ఐలి సందీప్, మెడిసిటీ హాస్పటల్ డైరెక్టర్ రవికిరణ్‌రెడ్డి, జీఎం పూర్ణ, మార్కెటింగ్ మేనేజర్ కుమారస్వామి, నాగార్జున, నవీన్, రాజు, రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, మెడిసిటీ, మెడినోవా హాస్పటల్స్ వైద్య సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఎంజీఎం' కోసం పోరాటమా.. రాజకీయ ప్రయోజనమా?


- బీఆర్‌ఎస్ నేతలపై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ధ్వజం



**వరంగల్, సెప్టెంబరు 24 (సమయం న్యూస్) :** ఎంజీఎం ఆస్పత్రి విషయంలో బీఆర్‌ఎస్ నేతలు రాజకీయాలు చేస్తున్నారని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎంజీఎం అభివృద్ధిని పట్టించుకోని నేతలకు ఇప్పుడు అకస్మాత్తుగా ఆస్పత్రిపై ప్రేమ పుట్టుకొచ్చిందని అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎంజీఎంలో కనీస వైద్య సదుపాయాల కల్పనకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని అయూబ్ ఆరోపించారు. నూతన ఆస్పత్రి నిర్మాణం పేరుతో హడావుడి చేయడం తప్ప దాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంజీఎం మౌలిక వసతులు, వైద్య సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. ఎంజీఎం ఘటనను మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ రాజకీయ అంశంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని అయూబ్ మండిపడ్డారు. పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలపై విచారణలో వాస్తవాలు తేలాల్సి ఉందన్నారు. ఘటనను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను పోలీసులు అనుమతించకపోవడంపైనా స్పందిస్తూ ఆస్పత్రిలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, పారదర్శకత ఉండాలని అన్నారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ప్రెస్‌మీట్లలో ఆరోపణలు చేయడం కాకుండా చట్టసభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్‌ఎస్ నేతలకు సూచించారు. ఎంజీఎం అభివృద్ధి కావాలా లేక దాని పేరుతో రాజకీయాలు కావాలా అన్నది ప్రజలే నిర్ణయిస్తారని మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ కమలుద్దీన్, జన్ను అరుణకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వానొచ్చినా.. వరదొచ్చినా.. ప్రజలకు అండగా...

- హన్మకొండ కలెక్ట ర్ చాహత్ బాజ్ పాయ్
- భారీ వర్షా లపై హై అలర్ట్ .. ప్రజల కోసం 24 గంటల నిఘా
- వర్ష ముప్పు పొంచి ఉన్నా.. ప్రజలకు అండగా యంత్రాంగం సిద్ధం



**హనుమకొండ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్) :** జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బజ్ పాయ్ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించి జిల్లాలో వర్షపాతం, ప్రస్తుత పరిస్థితులు, గురువారం, శుక్రవారం జారీ చేసిన హై అలర్ట్ నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం, చెరువులు, వాగులు, వంకలు, రహదారుల పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో భారీ వర్షాల సమయంలో సమస్యలు తలెత్తిన ప్రాంతాలను గుర్తించి అక్కడ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం వేలేరు, ఆత్మకూరు మండలాల్లో భారీ వర్ష పాతం నమోదైందని కలెక్టర్ తెలిపారు. గురు, శుక్రవారాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులపై వరదనీరు ప్రవహించే పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, వాగులు, వంకల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రహదారులపై వరదనీరు చేరే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట్ల ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో నీటి మట్టాల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి అప్‌డేట్ చేయాలని, వర్షం తీవ్రత పెరిగినప్పుడు చెరువుల నీటిమట్టం, నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో అధికారులు తమ పరిధిలోనే అందుబాటులో ఉండి, క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించాలని కలెక్టర్ సూచించారు. గత వర్షాల సమయంలో ఇబ్బందులు ఎదురైన ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు చర్యలను అంచనా వేసి అమలు చేయాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను వెంటనే తొలగించాలని, ప్రధాన నాలాల సమీపంలో నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌లో అధికారులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## ప్రణయ్ హత్య కేసు ఖైదీ అబ్దుల్ బారీ మృతి

నల్లగొండ, సెప్టెంబర్ 24( సమయం న్యూస్) మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన అమృత ప్రణయ్ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (45) గురువారం మృతి చెందాడు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఉన్న ఆయన గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. గురువారం గుండెపోటుతో అస్వస్థతకు గురికావడంతో జైలు అధికారులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ జిల్లా కోర్టు 2025 మార్చి 11న అబ్దుల్ బారీతో పాటు మరో ముగ్గురికి శిక్షలు విధించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఘటనపై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.



# ఆరేళ్ల బాలిక.. రూబిక్స్ క్యూబ్‌లో ప్రపంచ రికార్డు




**చైనా, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** వయసు కేవలం ఆరేళ్లు.. కానీ ప్రతిభ మాత్రం ప్రపంచస్థాయి. చైనాకు చెందిన లియాన్ యున్‌జి అలియాస్ 'జిజి' 3ఇ3 రూబిక్స్ క్యూబ్‌ను సగటున కేవలం 4.27 సెకన్లలో పరిష్కరించి మహిళల ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 4.5 సెకన్లలోపు ఈ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. సిచువాన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూకు చెందిన లియాన్ ఈ సెప్టెంబరులోనే తన రికార్డును రెండుసార్లు మెరుగుపరుచుకుంది. వుహాన్‌లో జరిగిన ప్రపంచ క్యూబ్ సంఘం గుర్తింపు పొందిన పోటీలో తొలుత 4.52 సెకన్ల సగటు సమయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత కేవలం మూడు రోజులకే గ్వాంగ్‌జౌలో జరిగిన పోటీలో 4.27 సెకన్లకు మెరుగుపరిచింది. ఐదు ప్రయత్నాల సగటు సమయాన్ని రికార్డుగా పరిగణిస్తారు. ఇందులో ఒకసారి ఆమె కేవలం 3.54 సెకన్లలోనే క్యూబ్‌ను పరిష్కరించింది. నాలుగేళ్ల వయసులో తొలిసారి రూబిక్స్ క్యూబ్‌ను ప్రయత్నించిన లియాన్‌కు అప్పట్లో ఒక క్యూబ్‌ను పూర్తి చేసేందుకు 90 సెకన్లు పట్టేది. రెండేళ్లుగా రోజుకు రెండు నుంచి మూడు గంటలపాటు సాధన చేస్తూ.. క్యూబ్‌ను పరిష్కరించేందుకు అవసరమైన 1,300కు పైగా అల్గారిథమ్స్‌పై పట్టు సాధించింది. రూబిక్స్ క్యూబ్ సాధనతో పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, తార్కిక ఆలోచన, ప్రాదేశిక అవగాహన వంటి నైపుణ్యాలు పెరుగుతాయని లియాన్ తల్లి లిన్ యాంగ్జీ తెలిపారు. పోటీల్లో అత్యంత వేగంగా క్యూబ్‌ను పరిష్కరించిన అనంతరం లియాన్ ఆనందంతో గంతులు వేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకుంటున్నాయి. లియాన్ సాధించిన 4.27 సెకన్ల సగటు సమయాన్ని 3ఇ3ఇ3 విభాగంలో మహిళల కొత్త ప్రపంచ రికార్డుగా ప్రపంచ క్యూబ్ సంఘం అధికారికంగా గుర్తించింది. చిన్న వయసులోనే ప్రపంచ రికార్డు సాధించడంతో లియాన్ ప్రతిభపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ఆటగాళ్ల గాయాలపై సీఓఈ తీరుపై అశ్విన్ తీవ్ర విమర్శలు



**చైనా, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** భారత క్రికెటర్ల గాయాలు, పునరావాస (రిహాబిలిటేషన్) నిర్వహణ విషయంలో బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై భారత మాజీ తిరోగమన బౌలర్ (ఆఫ్‌స్పిన్నర్) రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ వేదికగా మాట్లాడుతూ, ఆటగాళ్ల గాయాల నిర్వహణలో స్పష్టమైన జవాబుదారీతనం అవసరమని స్పష్టం చేశారు. ఆటగాళ్లపై విపరీతమైన పనిభారం పడుతున్న దృష్ట్యా టెస్టులు, వన్డేలు, టీ20 మూడు ఫార్మాట్లకు వేర్వేరు జట్లను సిద్ధం చేయాల్సిన సమయం వచ్చిందని అశ్విన్ అభిప్రాయపడ్డారు. తమిళనాడు ప్రీమియర్ లీగ్ కోసం అనుమతి కోరినప్పటికీ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని సీఓఈ సమయానికి విడుదల చేయకపోవడాన్ని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు. నెల రోజుల్లో కోలుకోవాల్సిన ఆటగాడు అక్కడ మూడు నుండి నాలుగు నెలల పాటు ఉండిపోవాల్సి రావడం సీఓఈ పనితీరును ప్రశ్నిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల జస్‌ప్రీత్ బుమ్రా గాయంపై సీఓఈ మరియు జాతీయ ఎంపిక (సెలెక్షన్) కమిటీ మధ్య సరియైన సమాచారం లేకపోవడం వల్లనే ఆయన శ్రీలంక పర్యటనకు దూరమయ్యారనే వార్తలు వచ్చాయి. మరోవైపు, ఆటగాళ్లకు అనుసరించే శిక్షణ విధానాలు కూడా గాయాలకు కారణమవుతాయని, 2015లో 'ఒలింపిక్ లిఫ్టింగ్' సాధన చేయడం వల్లనే తనకు నడుము పట్టుకుందని (సైడ్ స్ట్రెయిన్) అశ్విన్ గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే గాయాల నిర్వహణను చక్కదిద్దేందుకు బీసీసీఐ నూతన క్రీడా విజ్ఞాన మరియు వైద్య విభాగం (స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్) అధిపతి పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానించింది.

# తండ్రి సలహాతో ఆర్యవీర్ సెహ్వాగ్ బ్యాటింగ్






**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పెద్ద కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ క్రికెట్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఇటీవల భారత అండర్-19 జట్టు తరఫున ఆస్ట్రేలియాతో జరిగిన యువ వన్డే సిరీస్‌లో అరంగేట్రం చేసిన 18 ఏళ్ల ఆర్యవీర్.. మూడు మ్యాచ్‌ల్లో 28, 47, 34 పరుగులు చేశాడు. అంతకుముందు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో తన ప్రదర్శనపై ఆర్యవీర్ కొంత అసంతృప్తి వ్యక్తం చేశాడు. మూడు మ్యాచ్‌ల్లోనూ మంచి ఆరంభాలు లభించినా వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయానని చెప్పాడు. చివరి మ్యాచ్‌లోనూ కుదురుకున్న తర్వాత సిక్స్ కొట్టే ప్రయత్నంలో ఔటవడం నిరాశ కలిగించిందని తెలిపాడు. క్రికెట్‌లో గుర్తింపు పొందాలంటే భారీ పరుగులు చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నాడు. తన ఇంటిపేరు, తండ్రి సాధించిన విజయాల వల్ల ఎలాంటి ఒత్తిడిని అనుభవించడం లేదని ఆర్యవీర్ స్పష్టం చేశాడు. వీరేంద్ర సెహ్వాగ్ వారసత్వం గురించి తాను గర్వపడుతున్నానని, ప్రశంసలు, విమర్శలను పట్టించుకోకుండా తన ఆట, ప్రక్రియపై దృష్టి పెట్టేలా మానసికంగా సిద్ధమవుతున్నానని చెప్పాడు. ఆస్ట్రేలియాతో అరంగేట్రం మ్యాచ్‌కు ముందు కొంత నర్వస్‌గా ఉన్నప్పటికీ.. ఆ జట్టు బౌలర్ల వేగాన్ని ఎదుర్కోవడం మంచి అనుభూతినిచ్చిందని ఆర్యవీర్ తెలిపాడు. ఈ సిరీస్ తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని పేర్కొన్నాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ ఇచ్చే సలహాలను కూడా ఆర్యవీర్ వెల్లడించాడు. బ్యాటింగ్‌ను సాధ్యమైనంత సింపుల్‌గా ఉంచుకోవాలని తన తండ్రి సూచిస్తారని చెప్పాడు. కొట్టగల బంతిని కొట్టాలని, వదిలేయాల్సిన బంతిని వదిలేయాలని, అవసరమైతే డిఫెన్స్ ఆడాలని చెబుతారని తెలిపాడు. సోషల్ మీడియాలో వచ్చే వ్యాఖ్యలను పట్టించుకోకుండా టెక్నిక్‌తో పాటు మానసిక దృఢత్వంపై దృష్టి పెట్టాలని తండ్రి సూచిస్తున్నారని ఆర్యవీర్ చెప్పాడు.

## ఆసియా క్రీడల్లో భారత్-పాక్ మ్యాచ్ ఎప్పుడంటే?

**నాగోయా, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న 20వ ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబరు 24 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జపాన్.. ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడనుంది. ఆసియా క్రీడల చరిత్రలో క్రికెట్ పోటీలు నిర్వహించడం ఇది నాలుగోసారి. ఈసారి మొత్తం 10 జట్లు పతకాల కోసం పోటీ పడుతున్నాయి.

స్వర్ణం కోసం 10 జట్లు ర్యాంకింగ్‌ల ఆధారంగా భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పూర్తి సభ్య దేశంగా ఆఫ్ఘనిస్తాన్ కూడా ప్రధాన డ్రాలో నేరుగా చోటు దక్కించుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్ ద్వారా హాంకాంగ్, మలేషియా, నేపాల్, ఒమన్ అర్హత సాధించాయి. ఆతిథ్య దేశం కావడంతో జపాన్‌కు నేరుగా ప్రవేశం లభించింది.

భారత్-పాక్ మ్యాచ్ ఎప్పుడు?

ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉన్న ఆరు జట్లలో జపాన్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, ఒమన్, మలేషియా, హాంకాంగ్‌లను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో మూడు జట్లు ఉంటాయి. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే పోటీల్లో ప్రతి గ్రూపులో అగ్రస్థానంలో నిలిచే రెండు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంటాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో ఈ నాలుగు జట్లు భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌తో తలపడతాయి. అనంతరం సెమీఫైనల్స్, ఫైనల్ జరుగుతాయి. ఈ ఫార్మాట్ ప్రకారం భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరిగే అవకాశం ఫైనల్‌లోనే ఉంది. అయితే అందుకు ముందుగా రెండు జట్లూ తమ తమ క్వార్టర్, సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో విజయం సాధించి తుదిపోరుకు అర్హత సాధించాల్సి ఉంటుంది



# రహానే టెక్నిక్ సచిన్‌ను గుర్తు చేస్తుంది: స్టీవ్ వా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** భారత మాజీ టెస్టు కెప్టెన్ అజింక్య రహానే బ్యాటింగ్ టెక్నిక్ తనకు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను గుర్తు చేస్తుందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా ప్రశంసించాడు. రహానే బ్యాటింగ్‌లోని కాంపాక్ట్ టెక్నిక్, చిన్న బ్యాక్‌లిఫ్ట్, సమతుల్యత, ప్రశాంతమైన ఆటతీరు సచిన్‌ను తలపిస్తాయని పేర్కొన్నాడు. రహానేను సచిన్ స్ఫూర్తిగా తీసుకుని తన ఆటను తీర్చిదిద్దుకున్నాడా? అని స్టీవ్ వా ప్రశ్నించాడు. దీనికి రహానే స్పందిస్తూ.. చిన్నప్పటి నుంచే సచిన్ తనకు ఆరాధ్య దైవమని చెప్పాడు. ముంబైలో పెరిగిన తనలాంటి ఎంతోమందికి సచిన్ రోల్ మోడల్ అని తెలిపాడు. చిన్నతనంలో క్రికెట్ ఆడేటప్పుడు సచిన్ బ్యాక్‌లిఫ్ట్, చేతుల కదలిక, స్ట్రెయిట్ డ్రైవ్‌ను అనుకరించేవాడినని గుర్తుచేసుకున్నాడు. తర్వాత ఫస్ట్‌క్లాస్, అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్‌తో కలిసి ఆడే అవకాశం రావడం తన అదృష్టమని రహానే పేర్కొన్నాడు. సచిన్‌ను చిన్నప్పటి నుంచే ఆరాధించిన తాను.. ఆయనతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ప్రత్యేక అనుభూతి అని చెప్పాడు. సంభాషణ సరదాగా సాగుతున్న సమయంలో స్టీవ్ వా.. "సచిన్ అంత డబ్బు సంపాదించావా?" అని రహానేను అడిగాడు. దీనికి రహానే ఏమాత్రం తడుముకోకుండా.. "బహుశా ఇప్పటి నుంచి సంపాదిస్తానేమో" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చాడు. దీంతో వీరిద్దరి సంభాషణకు సంబంధించిన అంశం ఆసక్తికరంగా మారింది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రహానే ప్రస్తుతం స్టీవ్ వాకు చెందిన ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ఆడుతున్న రహానే టెక్నిక్, ప్రశాంత స్వభావాన్ని స్టీవ్ వా గతంలోనూ ప్రశంసించిన విషయం తెలిసిందే.

# రోహిత్‌తో బంధం ప్రత్యేకం: గంభీర్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** గౌతమ్ గంభీర్.. సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మతో తనకున్న అనుబంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ మధ్య ఉన్నది కేవలం కెప్టెన్-కోచ్ సంబంధం మాత్రమే కాదని, ఇద్దరి ఆలోచనా విధానాలు ఒకరికొకరికి బాగా తెలుసని చెప్పాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ నేపథ్యంలో గంభీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ జట్టులోకి వచ్చినప్పటి నుంచే తమ మధ్య మంచి అనుబంధం ఉందని గంభీర్ తెలిపాడు. తాను సీనియర్ ఆటగాడిగా ఉన్న సమయంలో రోహిత్‌తో కలిసి పనిచేశానని గుర్తుచేశాడు. మైదానంలో కొన్నిసార్లు ఆలోచనలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. చివరికి జట్టు ప్రయోజనాలే ఇద్దరికీ ముఖ్యమని పేర్కొన్నాడు. 2024 జులైలో హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రోహిత్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్‌తో కలిసి పనిచేశానని గంభీర్ చెప్పాడు. ఈ నలుగురిలోనూ జట్టుకే తొలి ప్రాధాన్యం ఇచ్చే లక్షణం ఉందని ప్రశంసించాడు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జట్టు విజయాన్నే ముందుగా చూసే కెప్టెన్లతో పనిచేయడం తన అదృష్టమని పేర్కొన్నాడు. శ్రేయస్ అయ్యర్‌లో నాయకత్వ లక్షణాలను 2018లోనే గుర్తించానని గంభీర్ తెలిపాడు. అప్పట్లో ఢిల్లీ జట్టు కెప్టెన్సీని అతనికి అప్పగించిన విషయాన్ని గుర్తుచేశాడు. ప్రస్తుతం మళ్లీ శ్రేయస్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నాడు. శుభ్‌మన్ గిల్ టెస్టు కెప్టెన్సీని కూడా గంభీర్ ప్రశంసించాడు. ఇంగ్లండ్ వంటి కఠినమైన పర్యటనలో ఐదు టెస్టులకు నాయకత్వం వహించడం పెద్ద సవాలేనని, అయినప్పటికీ గిల్ ఆ సవాలును అద్భుతంగా స్వీకరించాడని చెప్పాడు. రాబోయే సంవత్సరాల్లో గిల్ నుంచి మరింత అత్యుత్తమ ప్రదర్శన చూడొచ్చని గంభీర్ విశ్వాసం వ్యక్తం చేశాడు.



# "జార్జ్ క్రిష్'లో మానస వారణాసి



**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో కథానాయికగా మానస వారణాసిని ఎంపిక చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. శర్వానంద్‌కు జోడీగా ఆమె కనిపించనున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఇటీవల గుర్తింపు తెచ్చుకున్న మానస.. తన నటనతో ప్రశంసలు అందుకున్నారు. 'జార్జ్ క్రిష్'లో ఆమె పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. శర్వానంద్, శ్రీను వైట్ల తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శర్వానంద్‌కు సంక్రాంతి సెంటిమెంట్ ఉండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇటీవలే పూజా కార్యక్రమాలతో సినిమా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత సురేశ్‌బాబు కెమెరా స్విచ్ఛాన్ చేయగా.. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లాప్ కొట్టారు. తొలి షాట్‌కు శ్రీను వైట్ల దర్శకత్వం వహించారు. కేవీ గుహన్ ఛాయాగ్రహణం అందిస్తుండగా.. అనూప్ రూబెన్స్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాశ్ కొల్లా కళా దర్శకత్వం, అమర్ రెడ్డి కుడుముల ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ కథ అందిస్తున్నారు.




# 'సిగ్మా' చిత్ర ఆవిష్కరణ వేడుకకు చిరంజీవి

## అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సినిమా విడుదల.

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** యువ నటుడు సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త చిత్రం 'సిగ్మా' ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న ఈ చిత్ర పూర్వ విడుదల (ప్రీ-రిలీజ్) వేడుకకు టాలీవుడ్ అగ్ర నటుడు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ సామాజిక మాధ్యమాల ద్వారా అధికారికంగా ప్రకటిచడంతో చిత్రంపై అంచనాలు పెరిగాయి.

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ చిత్రంతో సంవిధానకర్తగా (దర్శకుడిగా) చిత్రసీమలోకి ప్రవేశిస్తుండటం విశేషం. సుభాస్కరన్ నేతృత్వంలోని 'లైకా ప్రొడక్షన్స్' నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించగా, తమన్ సంగీతాన్ని అందించారు. తెలుగు రాష్ట్రాలలో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పంపిణీ చేస్తుండగా, గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# రష్మీ దేశాయ్ తొలినాళ్ల కష్టాలు చేదు అనుభవాలు

**ముంబై, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** బుల్లితెరపై ఎంతో సంతోషంగా కనిపించే నటీనటుల జీవితాల వెనుక తీవ్రమైన పోరాటాలు, కన్నీళ్లు దాగి ఉంటాయనడానికి ప్రముఖ టెలివిజన్ నటి, 'బిగ్ బాస్' ఫేమ్ రష్మీ దేశాయ్ ఎదుర్కొన్న పరిస్థితులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. కెరీర్ ప్రారంభంలోనూ, ఆ తర్వాత వ్యక్తిగత జీవితంలోనూ తాను ఎదుర్కొన్న భయానక ఘటనలను, ఆర్థిక సంక్షోభాన్ని ఆమె ఒక సంభాషణలో గుర్తుచేసుకున్నారు. కేవలం 16 ఏళ్ల పిన్న వయసులోనే ఒక ఆడిషన్‌కు వెళ్లిన సమయంలో తీవ్ర చేదు అనుభవం ఎదురైందని ఆమె తెలిపారు. అక్కడ మరెవరూ లేకపోవడంతో సందేహం వచ్చిందని, ఒక వ్యక్తి తనకు మత్తు పదార్థం కలిపిన పానీయాన్ని ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసేందుకు ప్రయత్నించగా, వెంటనే అప్రమత్తమై అక్కడి నుంచి తప్పించుకుని బయటపడినట్లు వెల్లడించారు. అంతేకాకుండా భర్తతో విడిపోయిన అనంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను అనుభవించానని ఆమె పేర్కొన్నారు. ఇల్లు కొనుగోలు రుణాలతో పాటు రూ. 3.25 కోట్ల అప్పుల్లో ఉన్న సమయంలో చేస్తున్న ధారావాహిక కూడా ఆగిపోవడంతో రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఆ క్లిష్ట సమయంలో నాలుగు రోజుల పాటు తన సొంత కారులోనే గడపాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక దశలో చిన్న బడ్జెట్ చిత్రాల్లో నటిస్తూ కెరీర్ ప్రారంభించిన రష్మీ, ఆ తర్వాత హిందీ బుల్లితెరపై నటిగా, రియాలిటీ కార్యక్రమాల ద్వారా విశేషమైన గుర్తింపును సంపాదించుకున్నారు.

# 'గుండెనిండా గుడిగంటలు' అమూల్య గౌడ సందడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్):** తెలుగు బుల్లితెరపై ప్రసారమయ్యే ధారావాహికలు, వాటిలోని నటీనటులు వెండితెర తారల స్థాయిలో విశేష ఆదరణ సొంతం చేసుకుంటున్నారు. ప్రస్తుతం 'స్టార్ మా' వేదికగా ప్రసారమవుతున్న ప్రముఖ ధారావాహిక 'గుండెనిండా గుడిగంటలు'లో 'మీనా' అనే పాత్రలో నటిస్తూ కన్నడ నటి అమూల్య గౌడ తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యతనిచ్చే అమాయకపు అమ్మాయిగా భావోద్వేగ సన్నివేశాల్లో సహజ నటనను కనబరుస్తూ ఆమె మంచి ప్రజాదరణ పొందారు. గతంలో కన్నడ సీరియల్ 'శ్రీగౌరి' ద్వారా నటనా ప్రయాణాన్ని ప్రారంభించి, అక్కడ 'బిగ్ బాస్' రియాలిటీ కార్యక్రమంలోనూ పాల్గొని అమూల్య మంచి పేరు సంపాదించుకున్నారు. ధారావాహికలో సాంప్రదాయ చీరకట్టులో కనిపించే ఈ నటి, సామాజిక మాధ్యమాలలో మాత్రం ఆధునిక దుస్తులతో కూడిన విభిన్న రూపాలతో (స్టైలిష్ లుక్స్) నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈమెకు అంతర్జాలంలో 5 లక్షలకు పైగా అనుచరులు (ఫాలోవర్లు) ఉండగా, ఆమె పంచుకునే చిత్రాలు సామాజిక మాధ్యమాలలో విశేషంగా వైరల్ అవుతున్నాయి.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# శంషాబాద్ లో రికార్డు ధర పలికిన వినాయకుడి లడ్డు

- **6లక్షల మూడు వేలకు వేలపాటలో లడ్డును దక్కించుకున్న అబ్దుల్ కలాం టౌన్షిప్ కాలనీ అధ్యక్షుడు షేక్ బాషా**



**శంషాబాద్ సమయం సెప్టెంబర్ 24:** గ్రేటర్ హైదరాబాద్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని 118వ డివిజన్ అబ్దుల్ కలాం టౌన్షిప్ లో అబ్దుల్ కలాం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలని వాసులతో కలిసి వినాయకుడిని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా తొమ్మిది రోజులపాటు విఘ్నేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించిన కాలనీ ప్రజలు నవరాత్రులు పూర్తి అయిన సందర్భంగా బుధవారం రాత్రి వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు అందుకున్న లడ్డును అసోసియేషన్ సభ్యులు వేలంపాట ఏర్పాటు చేశారు. ఈ వేలం పాట నిర్వహించారు. అసోసియేషన్ కాలనీ అధ్యక్షుడు షేక్ బాషా పాల్గొని చివరకు శంషాబాద్ లోనే రికార్డు ధర ఆరు లక్షల మూడు వేల రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ అబ్దుల్ కలాం టౌన్షిప్ కాలనీ మతసామరస్యానికి నిదర్శనమని అందుకు కారణం ఈ వేలంపాటలు మైనారిటీ కి చెందిన వ్యక్తి వినాయకుడి లడ్డూను సొంతం చేసుకోవడంతోనే అర్థమవుతుందని తెలిపారు. అనంతరం అబ్దుల్ కలాం టౌన్షిప్ కాలనీ అధ్యక్షుడు షేక్ బాషా మాట్లాడుతూ కాలనీలో ప్రజలంతా ఐక్యమత్యతతో కలిసి జీవిస్తామని కులం మతం తేడా అనేది మా కాలనీలో ఉండదని అందరం మనుషులుగానే జీవిస్తామని వేలంపాటలో వినాయకుడి లడ్డు సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందని ఈ లడ్డును కాలనీలో ప్రజలందరికీ పంచుతామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూచిపూడి దత్తు,మోహన్ రెడ్డి,మేడిశెట్టి రఘు,దేవేందర్,శేఖర్,శ్రీనివాస్,సుధాకర్,సంతోష్, రవీందర్, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- **బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య**

**సంగారెడ్డి సమయం న్యూస్ సెప్టెంబర్ 24:-** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి పోలీసు, రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంక్షేమ శాఖలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. సిద్దిపేటలో మొబైల్ కోర్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణకు సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వారి కోటా మేరకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వారికి విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమాలకు అధికారులు, ప్రజలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించరాదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాల అమలులో అధికారులు జాప్యం లేదా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, యూనిఫామ్స్, పుస్తకాలు, మౌలిక వసతులు, స్కాలర్‌షిప్‌లు, వసతి గృహాల మరమ్మతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న రైతు భరోసా, రైతు బీమా, పారిశుద్ధ్య కార్మికులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్న చైర్మన్, బ్యాక్‌లాగ్ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలను పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో శాశ్వత అంగన్‌వాడీ భవనాలు లేని కేంద్రాలకు స్థలాలను గుర్తించి, భవనాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, భూ సేకరణలో అసైన్డ్ భూములు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా పరిధిలో పరిష్కరించగలిగిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని, కమిషన్ చైర్మన్ సూచనలు, సలహాలను అమలు చేస్తామని తెలిపారు. జిల్లాలో అట్రాసిటీ కేసుల్లో 109 మంది బాధితులకు జనవరి 2026 నుంచి ఆగస్టు 31 వరకు రూ.1.70 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. వీరిలో 88 మంది ఎస్సీలు, 21 మంది ఎస్టీలు ఉన్నారని వివరించారు. మరో 119 పెండింగ్ అట్రాసిటీ కేసులకు సంబంధించి పరిహారం చెల్లించేందుకు అవసరమైన రూ.1.82 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోపు చార్జిషీట్లు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం ఎస్సీ, ఎస్టీల నుంచి వివిధ సమస్యలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య వినతులను స్వీకరించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్,రాంబాబు నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బస్టాండ్ ఊరికి దూరమైతే.. ప్రజలకు ఇబ్బందులే!

- **ప్రస్తుత బస్టాండ్ స్థలంలోనే కాంప్లెక్స్ .. కొత్త బస్టాండ్ ఊరి చివరన వద్దు**
- **ప్రభుత్వం నిర్ణయాన్ని మరోసారి పరిశీలించాలి**
- **సీపీఐ నియోజకవర్గ ఇన్ చార్జి గంటి సురేష్ కుమార్**

**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,24(సమయం న్యూస్)** కొడంగల్ పట్టణంలో నూతన బస్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ప్రతిపాదిత స్థలంపై మరోసారి ఆలోచించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి సురేష్ కుమార్ కోరారు. ప్రస్తుతం ఉన్న బస్టాండ్ ప్రాంతంలోనే అవసరమైన కాంప్లెక్స్ నిర్మించి, బస్టాండ్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని ఆయన సూచించారు. గురువారం కొడంగల్ లోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ

హైదరాబాద్ రూట్‌లో పట్టణానికి చివరన నూతన బస్టాండ్ నిర్మించాలనే ప్రతిపాదన వల్ల ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. బస్టాండ్ చుట్టూ ఏర్పడే రాకపోకలే పట్టణంలోని చిన్న వ్యాపారాలు, చిరు వ్యాపారులకు ప్రధాన ఆధారమని తెలిపారు.ప్రస్తుత అంబేద్కర్ చౌరస్తా ప్రాంతంలో ప్రయాణికుల రాకపోకలతో అనేక చిన్న దుకాణాలు, చిరు వ్యాపారాలు కొనసాగుతున్నాయని సురేష్‌కుమార్ అన్నారు. ప్రయాణికులు కొనుగోలు చేయడం ద్వారా కొన్ని కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. బస్టాండ్‌ను పట్టణానికి దూరంగా తరలిస్తే ఆయా వ్యాపారాలకు గిరాకీ తగ్గి ఉపాధి అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు.బస్టాండ్ ఒకచోట, పట్టణంలోని ప్రధాన వ్యాపార ప్రాంతాలు మరోచోట ఉంటే ప్రజలు రాకపోకలకు అదనపు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, రోజువారీ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు.స్థలం సరిపోవడం లేదనే కారణంతో బస్టాండ్‌ను పట్టణానికి దూరంగా తరలించడం సరైన నిర్ణయం కాదని ఆయన అన్నారు. ప్రస్తుత బస్టాండ్‌కు సమీపంలోనే అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించి నూతన బస్టాండ్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రజల అవసరాలు, స్థానిక వ్యాపారుల ఉపాధి, పట్టణ భవిష్యత్ రాకపోకలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదిత స్థలాన్ని మరోసారి పరిశీలించాలని గంటి సురేష్‌కుమార్ కోరారు.




# వృద్ధులను ప్రేమ, గౌరవంతో చూసుకోవాలి

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 24( సమయం న్యూస్,)** అంతర్జాతీయ వృద్ధుల వారోత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయకుండా ప్రేమ, ఆప్యాయతతో చూసుకోవాలని సూచించారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం చట్టరీత్యా శిక్షార్హమని, వారి సంరక్షణ, గౌరవం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వృద్ధుల హక్కులు, సంక్షేమంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. వయోవృద్ధులకు కుటుంబ సభ్యులు అండగా నిలిచి, వారికి భద్రతతో కూడిన గౌరవప్రదమైన జీవనాన్ని అందించేందుకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సాయి శివాని, జిల్లా సంక్షేమ అధికారి ఎస్. జరీనా బేగం, జీడీఎంహెచ్ఓ శ్రీనివాసులు, అదనపు డీఎంహెచ్ఓ శశికాంత్, డీఐఓ శంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై చర్య తీసుకోవాలి



**వలిగొండ సెప్టెంబర్ 24 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల ప్రాథమిక పాఠశాలలో ఊర్లో ఉన్నటువంటి యువకులు గుర్తుతెలియ వ్యక్తులు రాత్రి వేళలో అసంఘిక కార్యకలాపాలకు గురై తాగుడుకు బానిస అయిపోతున్నారు. ఎక్కడ లేని స్థలంలో బడి గుడి వంటిది అలాంటి బడిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులను వారిపై చర్య తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. ప్రహరి గోడ ఉండి గేటుకు తాళం ఉన్నా కూడా లోపలికి దూకి వచ్చి అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారు. ప్రజలు అందరు కలిసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని స్థానిక సర్పంచ్ మరియు అధికారులు తక్షణమే స్పందించి ఈ ఘటన మీద చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జోగు సైదులు

## ప్రభుత్వ పాఠశాలకు రూ.20 వేల విలువైన సౌండ్ సిస్టం అందజేత



**పోతంగల్, సెప్టెంబర్ 24 (సమయం న్యూస్ ) :** పోతంగల్ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పోతంగల్ లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ సూదాం నవీన్ గురువారం రూ.20 వేలకుపైగా విలువ చేసే సౌండ్ సిస్టంను అందజేశారు.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఈ సౌండ్ సిస్టంను అందించినట్లు లయన్ సూదాం నవీన్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా లయన్స్ క్లబ్ సభ్యుడు రవీంద్రబాబు రూ.5 వేల విలువైన పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలకు విలువైన సౌండ్ సిస్టం అందించిన సూదాం నవీన్‌ను ప్రధానోపాధ్యాయురాలు విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి నాగయ్య, కోశాధికారి అనిల్, పల్లెంపాటి శ్రీధర్, సీతాలే రమేష్, ఉమాపార్వతి, బండారి హనుమాన్లు, సంతోష్ పటేల్, చిత్తరి శ్రీనివాస్, రత్నాకర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సర్వజానిక్ హనుమాన్ గణేష్ మండలి ఆధ్వర్యంలో మహా అన్నదానం



**పోతంగల్, సెప్టెంబర్ 24, (సమయం న్యూస్ ) :** పోతంగల్ మండలంలోని కల్లూరు గ్రామంలో శ్రీ సర్వజానిక్ హనుమాన్ గణేష్ మండలి ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధల మధ్య మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గణేష్ మండపానికి విచ్చేసిన భక్తులకు, గ్రామ ప్రజలకు నిర్వాహకులు అన్నప్రసాదాన్ని వడ్డించి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



**సంగారెడ్డి జిల్లా సమయం న్యూస్ సెప్టెంబర్ 24** హస్నాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో మురికి కాలువల నిర్మాణం హస్నాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి సహకారంతో ఎస్ డి ఎఫ్ నిధులు ఐదు లక్షల రూపాయలు వ్యాయామంతో మురికి కాలువ నిర్మాణం మరియు సి ఆర్ ఆర్ ఫండ్స్ బీసీ కాలనీలో 5 లక్షల వ్యాయంతో మురికి కాలువ నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది ఈ అభివృద్ధి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుర తులసి & హన్మంతు, ఉప సర్పంచ్ భారతమ్మ ,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఏడాకులపల్లి మోహన్ , మాజీ విట్టల్, వార్డ్ మెంబర్స్ అనిల్ ,రాములు, క్యాసారం కేసారం సత్యమ్మ ,సీనియర్ నాయకులు సంగమేష్ ,విట్టల్ ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు ఎస్సీ కాలనీకి మరియు బీసీ కాలనీకి మొత్తానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేసిన గౌరవ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ గారికి హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీగ్రామ పార్టీ అధ్యక్షులు ఏడాకులపల్లి మోహన్ గారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు మంత్రిగారి సహకారంతో హస్నాబాద్ గ్రామన్ని మరింత అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లా లని మంత్రి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాం

## గణేష్ నిమజ్జ నోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్న: జిల్లా ఎస్పీ



**నారాయణపేట,సెప్టెంబర్,24(సమయం న్యూస్)** గణేష్ నవరాత్రి నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట జిల్లా కేంద్రంలోని మెయిన్ చౌక్‌లో విశ్వహిందూ పరిషత్, గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS, రాహుల్ IAS, మున్సిపల్ చైర్‌పర్సన్ కొండ శ్వేత సత్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివ రెడ్డి, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గత 11 రోజులుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కొనసాగాయని ఎస్పీ తెలిపారు. నేడు గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళుతున్న నేపథ్యంలో శోభాయాత్రను తిలకించేందుకు వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, అందరూ సంతోషంగా, శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

## శుభోదయం కాలని లో నవరాత్రి ఘనంగా లడ్డు మహిస్తవం

**కుషాయి గూడ సెప్టెంబర్ 24( సమయం న్యూస్,)**కుషాయిగూడ పరిధిలోని శుభోదయ కాలనీ ఫేజ్–3లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలు, ఉత్సాహం నడుమ జరిగిన లడ్డు వేలంపాటకు కాలనీ వాసుల నుంచి మంచి స్పందన లభించింది. గణనాథుడి ప్రసాదంగా భావించే లడ్డును దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. వేలంపాటలో మణిశ్రీ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఏ. శ్రీనివాస్ రూ.3,05,001లకు తొలి లడ్డును దక్కించుకున్నారు. రెండో లడ్డును సోనియాగాంధీ ఫేజ్–1కు చెందిన బంకు శ్రీనివాస్ రూ.1,07,001లకు సొంతం చేసుకున్నారు. కాలనీ అధ్యక్షుడు తీగుళ్ల రామచందర్, ప్రధాన కార్యదర్శి బలగం మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## వై ఎస్ సి ఏ ఆధ్వర్యంలో వినాయకుని నిమజ్జ నం



**వలిగొండ సెప్టెంబర్ (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో వై ఎస్ సి ఎ యూత్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల తహసిల్దార్ దశరథ హాజరైనారు. వైయస్సీఏ యూత్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా శాలువతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ కమిటీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా ఉత్తమ అవార్డుల ప్రధానోత్సవం

**వలిగొండ సెప్టెంబర్ 24 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మండల వారీగా ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు ఇవ్వడం జరిగింది. వెల్వర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆర్ట్ టీచర్ గా పని చేస్తున్న సంగిశెట్టి రాములు కు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు మండల విద్యాధికారి జి. జలంధర్ రెడ్డి సుంకోజు. భాస్కర్ శాలువతో సన్మానం చేసి అవార్డు ఇవ్వడం జరిగింది. జిల్లా ఉత్తమ అవార్డుగా ఉపాధ్యాయులు వీరస్వామి, పిఈటి గండమల్ల స్వామి రాజ్ అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సీఐ, ఎస్ఐలను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

**షాబాద్: సెప్టెంబర్ :24:( సమయం న్యూస్)**ఎమ్మార్పీఎస్ షాబాద్ మండలనూతన కమిటీ ఆధ్వర్యంలో సీఐ లక్ష్మి రెడ్డి, ఎస్ఐలు చెన్నారెడ్డి, విజయ్ లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మాదిగ, దళిత బిడ్డలకు అన్యాయం జరగకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్కి ప్రవీణ్ మాదిగ, మాజీ అధ్యక్షుడు ముక్కు విశ్వం మాదిగ, ఉపాధ్యక్షులు కాడిగాని ప్రవీణ్ మాదిగ, రవీందర్ మాదిగ, కోశాధికారి కాడిగాని యాదగిరి మాదిగ, ప్రధాన కార్యదర్శి వినోద్ మాదిగ, కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక



**నారాయణపేట, సెప్టెంబర్ 24:** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా, నారాయణపేట జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ సీ. హెచ్ ప్రియాంక, ఐఏఎస్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వృద్ధుల సంక్షేమం, సంరక్షణ, భద్రత మరియు హక్కులకు సంబంధించిన పోస్టర్లు, "ఎల్డర్ గైడ్" మరియు ఇతర అవగాహన సామగ్రిని ఆవిష్కరించి విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంరక్షణ, భద్రత, సంక్షేమం మరియు చట్టబద్ధమైన హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వృద్ధులను గౌరవంగా చూడటం, వారి అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.వృద్ధుల హక్కులు, గౌరవం మరియు భద్రతను పరిరక్షించేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వృద్ధులు గౌరవప్రదమైన,సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేలా అవసరమైన సహాయాన్ని అందించేందుకు అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మరియు దివ్యాంగులు,వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమ శాఖ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సాయి, సూపర్‌వైజర్ మీనాక్షి, సఖి అడ్మిన్ క్రాంతి రేఖ, DHEW కోఆర్డినేటర్ నర్సింహులు, DWO office staff ఇతర శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల నిఘా నీడలో గణేష్ శోభాయాత్ర

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**నారాయణపేట, సెప్టెంబర్, 24(సమయం న్యూస్)** గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా పూర్తయ్యేలా పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని మరియు మక్తల్, నారాయణపేట పట్టణాలలో గణేష్ రూట్ మార్గాలలో సీసీ కెమెరాల నిఘా నీడలో శోభయాత్ర, నిమజ్జనం జరుగుతుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు.గురువారం రోజు జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ లో ఉన్న సీసీ కెమెరాలు ఎస్పీ స్వయంగా పరిశీలించి కంట్రోల్ రూమ్ సిబ్బందికి 24★7 అప్రమత్తంగా ఉంటూ సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇయ్యాలని అలాగే డయల్ 112 కు కాల్స్ వచ్చినప్పుడు వేగవంతంగా స్పందించి త్వరగా చేరుకొని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో నారాయణపేట కంట్రోల్ రూమ్ నెంబర్ 8712670399 కి లేదా డయల్ 112 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 1,728 గణేష్ విగ్రహాల్లో ఇప్పటికే సుమారు 1,300 విగ్రహాలు నిమజ్జనం పూర్తయ్యాయని, మిగిలిన నిమజ్జనాలు కూడా ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు.నారాయణపేట, మక్తల్ పట్టణాలలో శోభాయాత్రలు సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ, డ్రోన్ కెమెరాల నిఘాలో కొనసాగుతున్నాయని, జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాలను 24×7 పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. చెరువుల వద్ద నిర్వాహకులు, కమిటీ సభ్యులు భద్రతా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజల



ఆరోగ్యం, శాంతిభద్రతల దృష్ట్యా డీజేలకు నిషేధం అమల్లో ఉందని, తక్కువ శబ్దంతో సౌండ్ బాక్సులు, సంప్రదాయ పద్ధతుల్లో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు బెల్ట్ షాపులపై దాడులు కొనసాగించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచేలా అనుచిత పోస్టులు చేయవద్దని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా, సామరస్యంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, మహేష్,RI విజయ్ భాస్కర్, ఎస్బి ఎస్సై భాగ్య లక్ష్మీ రెడ్డి ఉన్నారు.

## గణనాథుడికి ఘనంగా వీడ్కోలు

### స్టార్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వైభవంగా నిమజ్జనం



**రాయపోల్ సెప్టెంబర్ 24:** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన గణనాథుడికి భక్తిశ్రద్ధలతో ఘనంగా వీడ్కోలు పలికారు. స్టార్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమం భక్తుల సందడితో వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. డప్పులు, మేళతాళాలు, నృత్యాలతో యువత ఉత్సాహంగా పాల్గొనగా పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు నినాదాలు చేస్తూ నిమజ్జన ప్రదేశానికి చేరుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టార్ యూత్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్టార్ యూత్ క్లబ్ సభ్యులు, నిర్వాహకులు, యువత, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యారంగా సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

### డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్.

**రాయపోల్ సెప్టెంబర్ 24.**ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ బడుల బలోపేతం లక్ష్యంగా సెప్టెంబర్ 25 న నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట జిల్లా రాయపోల్ లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయాలి, ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి, రాష్ట్ర బడ్జె ట్ లో విద్యకు 18 శాతం నిధులు కేటాయించాలి. వంటి ప్రధానమైన సమస్యలతో విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రభావం తదితర అంశాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో మాజీ విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి చేపడుతున్న తెలంగాణ విద్యా బస్సుయాత్ర గురువారం



జగదేవ్ పూర్ మండలం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో బడి నిద్ర నిర్వహించి శుక్రవారం గజ్వేల్ పట్టణంలో టిపిటిఎఫ్ భవన్ లో ఉదయం 10:00 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, రిటైర్డ్ ఐఏఎస్ చంపాలాల్, ప్రొఫెసర్ పద్మజా,రుబీనా, సృజన్ యాదవ్, ఢిల్లీ జేఎన్టీయూ నిఖిల్, విజయ, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాబట్టి ప్రభుత్వ విద్యను కాపాడేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఖమ్మంలో ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలు చరిత్ర సృష్టిస్తాయి

- రైతు, కూలీల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన

**ఆలేరు, సెప్టెంబరు 24(సమయం న్యూస్):** ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగో జాతీయ మహాసభలు చరిత్ర సృష్టించనున్నాయని సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్లెపు అడివయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఇక్కిరి సహదేవ్ అన్నారు. గురువారం ఆలేరు మండలం టంగుటూరులో ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా మహమ్మారి సమయంలో దేశ ప్రజలు లాక్‌డౌన్ కారణంగా ఇళ్లకే పరిమితమైన సమయంలో కేంద్ర ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. వాటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం నిర్వహించిన ఉద్యమం కీలకంగా నిలిచిందని, ఆ పోరాటంలో ఏఐకే



ఎంఎస్ క్రియాశీలక పాత్ర పోషించిందని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే విధానాలను అమలు చేస్తోందని వారు ఆరోపించారు. దేశీయ వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, ఇతర వస్తువుల ఉత్పత్తి, మార్కెట్లపై ఈ విధానాల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ రంగ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న విధానాలను నిరసిస్తూ ఏఐకేఎంఎస్ దేశవ్యాప్తంగా పలు పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మంలో జరగనున్న నాలుగో జాతీయ మహాసభలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధరలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, రైతుల సమస్యలు తదితర అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణతోపాటు ఐక్య రైతాంగ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్.సీత, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు చిర బోయిన కొమురయ్య, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మారు జోడు సిద్ధేశ్వర్, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల సిద్దులు, ప్రజా సంఘాల నాయకులు మారుజోడు కుమార్, జాలపు బిక్షంరెడ్డి, ఇక్కిరి నరసింహులు, కూకట్ల బిక్షపతి, భూపెల్లి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.